ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 7, 2014

- మూడు జంటల ముందడుగు
- కథ – 'బజ్జో కన్నా'
- ఆలయాల వనం 'వారణాసి'

ఆ పది పల్లెలు

ఉల్కా గుప్తా

షీనా బజాజ్

టీవీ టు టాలీవుడ్

సనా మక్బుల్ ఖాన్

బుల్లితెర మీద ఒక వెలుగు వెలిగిన చిన్ని తారలు టాలీవుడ్‌లో తేలుతున్నారు. 'చిన్నారి పెళ్లికూతురు'గా అందరికీ సుపరిచితమైన అవికా గోర్ 'ఉయ్యాల జంపాల' ద్వారా కథానాయికగానూ అలరించింది. ఆ ఊపులోనే 'లక్ష్మీ రావే మా యింటికి' చిత్రాన్ని చేసేసింది. అవిక సక్సెస్ ... ఉల్కా గుప్తా, షీనా బజాజ్, సనా మక్బుల్ ఖాన్, సోనారికా బదూరియా, శ్రియా శర్మ... ను సైతం టాలీవుడ్ వైపు నడిపించిందనే చెప్పకోవాలి. 'ప్యార్ కో క్యా నామ్ దూన్', 'అర్జున్' సీరియల్స్‌తో మంచి పేరు తెచ్చుకున్న సనా మక్బుల్ ఖాన్ 'దిక్కులు చూడకు రామయ్యా' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. 'దేవన్ కి దేవ్ మహదేవ్' సీరియల్‌తో పేరు తెచ్చుకున్న సోనారికా బదూరియా నాగశౌర్య జంటగా సినిమా చేయబోతోంది. 'ఝాన్సీ కి రాణి' సీరియల్‌లో రాణి లక్ష్మీబాయ్‌గా పాపులర్ అయిన ఉల్కా గుప్తా గుణశేఖర్ భారీ చిత్రం 'రుద్రమ దేవి'లో బాల రుద్రమ దేవిగా చేస్తోంది. 'బెస్ట్ ఆఫ్ నిక్కి'లో మెరిసిన షీనా బజాజ్ కూడా 'కుమారి 21 ఎఫ్' చిత్రంతో రాజ్‌తరుణ్ సరసన నటిస్తోంది. వాణిజ్య ప్రకటనలు, చిన్ని తెరపై బుల్లి పాత్రలు చేసిన శ్రియ 'గాయకుడు' చిత్రం కథానాయికగా వెండితెరపై మెరిసింది. అంతేగా మరి. అవకాశం వచ్చినప్పడే అందుకోవాలి. టాలెంట్‌ను నిరూపించుకోవాలి. అయినా ఆ విషయం తెలవనిదెవరికీ! ❑

అవికా గోర్

సోనారికా

శ్రియా శర్మ

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

నమ్మకమే మరి!



◆ మనలో మాట

నమ్మకం! ఎంత చిన్ని మాట! కానీ దా...న్ని వర్ణించడం మ...హా... కష్టం. ఇది నిరూపణ అయితే సరి. కాని పక్షంలో కేవలం నమ్మకంగానే మిగిలిపోతుంది. ఒకరికి నమ్మకంగానూ, మరొకరికి నిజంగానూ, కన్పించేవి కోకొల్లలు. శాస్త్ర సాంకేతిక విజయాలు ఆ కోవకు చెందినవే. శాస్త్రవేత్తలకు మినహా... సామాన్యులకు అవి కేవలం నమ్మకాలే.

తల్లిదండ్రులకు బిడ్డల మీద కొండంత నమ్మకం. మంచిని మరువరని. విడవరని. దురలవాట్లకు బానిసలు కారని. కలలో కూడా తప్పు చేయరని (ఒకవేళ బిడ్డ తప్పు చేసినా నమ్మలేరు). బిడ్డలకూ అంతే! పెద్దలు తమ మనసెరిగి మసలుకుంటారని, కోరినవి క్షణాల్లో అందిస్తారని. కడుపున పుట్టినవారిని కాదనలేరని (బిడ్డలే అయినా... గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సాధ్యమా!).

టీచరుకు చురుకైన విద్యార్థి మీద చెప్పలేనంత నమ్మకం, మంచి ర్యాంకు సంపాదించుకుంటాడని. తనకు, పాఠశాలకు పేరు తెస్తాడని. అలాంటి శిష్యుడు పరీక్షల్లో కాపీ కొట్టాడన్నా నమ్మలేరా గురువర్యులు.

వ్యాపారం మొదలెట్టాలంటే లాభాలొస్తాయన్న నమ్మకం వుండాలి. ఆ నమ్మకం కల్గించడానికే ఏలికలు తెగ తంటాలు పడుతుంటారు. లేని పోని విన్యాసాలు చేస్తుంటారు. పన్ను రాయితీలని... అవని.. ఇవని... కోట్లకు కోట్లు ... ఇచ్చేస్తుంటారు ఉదారంగా.

యజమానికి ఉద్యోగి మీద ఏమాత్రం నమ్మకం వుండదు. సరిగ్గా సమయానికి కార్యాలయానికి వస్తున్నాడా? లేడా? పని చేస్తున్నాడా లేదా? అనే విషయాలను కనిపెట్టడానికి అతని పైన ఒక ఉద్యోగిని సైతం నియమిస్తాడు. కార్మికుడికి యజమాని మీద ఎంత నమ్మకమో! తన కష్టం వల్ల పోగుబడిన సంపదను యజమానే సృష్టించాడనుకునేంత నమ్మకం. గుడ్డి నమ్మకం!

గుడ్డి నమ్మకాలే కాదు....మూఢ నమ్మకాలూ వున్నాయ్! శాస్త్రవేత్తలు రాత్రింబవళ్లు మేధోమథనం చేసి రాకెట్లు తయారుచేస్తారు. తీరా అంతరిక్షంలోకి పంపేముందు... తమ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు చేయిస్తారు. వ్యవసాయదారులూ అంతే! వంచిన నడుం ఎత్తక ఎండనక వాననక కష్టించి పని చేస్తాడు. దిగుబడి బాగా రావాలని ఏడుకొండలవాడికి మొక్కుకుంటాడు. ఒకవేళ రాకెట్ సక్సెస్ అయినా, పంట దిగుబడి బాగా వచ్చినా... అంతా దైవ లీలగానే భావిస్తారు. అంతే తప్ప తమ స్వశక్తి ఫలితమని ఒప్పకోరు. గుర్తించరు. అది వారి నమ్మకం

ఇక రాజకీయ నాయకులకు ఒకటే ధ్యాస. జనాన్ని ఎలా నమ్మించాలా అని. ఎన్నికల ముందైనా తర్వాతైనా! ముందు 'అది చేస్తాం. ఇది చేస్తాం' అంటూ అరిచేతిలో స్వర్గం చూపించేస్తారు. జనం నమ్మి ఓట్లు కుమ్మేస్తారు. తర్వాతి మాటేంటి? అప్పుడూ నమ్మించడానికే చూస్తారు నాయకులు. 'అది లేదు. ఇది లేదు. మా తప్పేం లేదు...అందుకే నాటి ప్రమాణాలను నిలబెట్టుకోలేకపోతున్నాం' అని నమ్మించాలనే చూస్తారు.

అయినా జనం నమ్ముతూనే వుంటారు!

■

ఈ సంచికలో....

ఆ పది పల్లెలు

కవర్‌స్టోరీ 14

మన దేశంలో పల్లెటూరు అంటే చాలు! ఏం గుర్తొస్తుంది? బురద, పేడ, చెత్త చెదారం... గుంటల మట్టి రోడ్లు, నిరక్షరాస్యత, పేదరికం, కనీస సౌకర్యాల లేమి, అంతకంతకు పెరిగిపోతున్న భ్రూణహత్యలు, ఊసే లేని ఇంటర్నెట్....! ఇలా ఎన్నయినా చెప్పకుంటూ పోవచ్చు. ఇందులో ఏమాత్రం అసత్యం లేదుగానీ... అన్ని గ్రామాలనూ ఒకే గాట కట్ట కూడదని మనవి. మన దేశంలోని ఓ పది పల్లెలు పట్టణాలకు దీటుగా ... ప్రపంచానికే మర్గదర్శకంగా నిలిచాయి.

వింత లోకం	....	3
కథ	....	6
బజ్జో... కన్నా		
రుచి	....	8
వేడివేడిగా...		
సమ్‌థింగ్ స్పెషల్	....	9
చవుడు భూముల్లో వరి సాగు		
సినిమా కబుర్లు	....	10
అదో పెద్ద సవాల్		
నవ్వుల్ - పువ్వుల్	....	11
స్ఫూర్తి	....	12
మూడు జంటల ముందడుగు		
సీరియల్	....	18
ప్రేమ విప్లవం		
ప్రత్యేకం	....	21
టమాటాలోయ్		
బాలనేస్తాలు	....	22
పావురం- కాకి కథ		
కొత్త పుస్తకాలు	....	24
మాయామర్మం లేని కథలు		

చూద్దామా 4

ఆలయాల వనం వారణాసి



టపా

అరెస్టు అన్యాయం కదా

ప్రపంచ పోలీస్ పాత్ర వహిస్తున్న అమెరికాలో అక్రమాలు, దోపిడి, పేదరికం, దారిద్ర్యం విలయతాండవం చేస్తున్నాయి. ఫ్లోరిడా రాష్ట్రంలో పేదలకు అన్నదానం చేస్తున్న 90 ఏళ్ల వృద్ధుడిని అరెస్ట్ చేయడం అన్యాయం. పేదలకు అన్నదానం చేయడం ఏ విధంగా నేరం కాదు. ప్రభుత్వం పేదరికాన్ని నివారించలేక ఆకలి చావుల్ని అరికట్టలేక పోతున్నది. అలా అని అన్నదానం చేసినందుకు అరెస్ట్ చేస్తున్నారు. అమెరికాలో నిరుద్యోగం ఎక్కువే. చక్కటి వివరాలు ఇచ్చారు.

- టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం.

◆◆◆◆

అలా చదివించింది

ఒక్కోసారి కథ భలేగా చదివిస్తుంది. ఆ నడక ఈ వారపు 'మిస్సింగ్'లో వుంది. పిల్లాడు కనిపించక బాధ పడే తల్లికి... ఇరుగుపొరుగు నీతి వాక్యాలు ఎంత బాధాకరంగా వుంటాయో చెప్పేదేముంది? నోరు తెరచి మరో మాట అనలేక...బిడ్డ కనిపించక ... ఆ తల్లి పడ్డ బాధ వర్ణనాతీతం. మొత్తానికి కథ సుఖాంతం చేశారు రచయిత్రి. ఇలాంటి ఘటనలు దాదాపుగా ప్రతి ఇంట్లోనూ వుండేవే. అయినా బావుంది.

పి. రజిత, కాకుమాను.

◆◆◆◆

చందనం ... వందనం...

ఎర్ర చందనం ఎంత అపురూపమైనదో తెల్సినా... మళ్లీ చదివి పలు విషయాలు తెలుసుకున్నాం. శ్రీగంధాన్ని ఇన్ని రకాలుగా ఉపయోగిస్తున్నారని మాత్రం ఇప్పుడే తెలిసింది. ఏదేమైనా దీనికి విదేశాల్లో కూడా మంచి డిమాండ్ వుంది. అందుకే ఇంతగా స్మగ్లింగ్ జరుగుతోంది. వీరప్పన్ వంటి దొంగలూ పుట్టుకొచ్చారు. ధర కూడా అద్దిరిపోతుంటే... ఇలా కాక మరెలా వుంటుందిలెండి పరిస్థితి.

ఎన్. రావూజీ, విజయవాడ.

◆◆◆◆

రెండు ప్రపంచాలు లేనిదెక్కడ?

ఈవారం చూద్దామాలో దుబాయ్ కబుర్లు చదివాం. రచయిత చెప్పినట్టు ఎంత సంపద వుందో అంత పేదరికం కూడా అనుభవిస్తున్నారక్కడ. మరీ ముఖ్యంగా వలస కార్మికులు. ఒకటి డబ్బు ఎక్కువైన ప్రపంచం. రెండు డబ్బు కరవైన ప్రపంచం. నిజానికి ఈ రెండు ప్రపంచాలు ఒక్క దుబాయ్‌లోనేనా! ప్రపంచం అంతటా వున్నాయి. మరి ఆ బేధాలు పోయి సమ సమాజం వచ్చేదెన్నడో!?

సౌమ్య, రమ్య, వినుకొండ.

◆◆◆◆

హా...బీ...లు

హాబీలు లేని మనిషే వుండడేమో! ఇంత చిన్న విషయాన్ని కూడా ఇన్ని రకాలుగా చూడొచ్చని తెలిశాక ఎంత ఆశ్చర్యం వేసిందో. ఎప్పుడూ తీరిక లేకుండా...సీరియస్‌గా వుండే పెద్దవాళ్ల హాబీలు గురించి చదివినప్పుడు తమాషాగా అన్పించింది. అవడానికి హాబీలే అయినా ... వాటి మీద మనసు పెట్టి మరింత లోతుగా విషయం తెలుసుకుంటే ఎప్పటికైనా ఉపయోగమే.

సుమంత్, విజయనగరం.

ఏడాదిగా ఎదురు చూస్తూ...

అయినవాళ్లు దూరమైతే కలిగే బాధ వర్ణనాతీతం. కానీ కాలం వుంది చూశారూ! భలేగా మాయ చేసేస్తుంది. రోజులు గడిచేకొద్దీ ఆ బాధ నుంచి మెల్లగా బైటపడి మామూలైపోతుంటాం. ఇవన్నీ మనలాంటి మామూలు మనుషులకే అనిపిస్తుంది. మాషా గురించి విన్నప్పుడు. వీటికీ తప్పలేదా ఈ తిప్పలు అనిపిస్తుంది. మధ్యలో ఈ మాషా ఎవరంటే!? రష్యాలో ఓ రిటైర్డ్ ఉద్యోగి పెంచుకున్న శునకం. దీనికి తన యజమాని అంటే వల్లమాని అభిమానం. రెండేళ్ల కిందట అనారోగ్యంతో ఆయన ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. అప్పటి నుంచి అతనికోసం ప్రతి రోజూ వచ్చే బంధువు...మిత్రుడు...అన్నీ మాషానే. పగలంతా యజమానికి కాలక్షేపంగా వుంటూ... రాత్రయితే చాలు! దగ్గరలో వున్న తమ ఇంటికెళ్లి కాపలా కాసేది. ఇలా సంవత్సరం గడిచింది. జబ్బు తగ్గకపోగా ఎక్కువై కాలం చేశాడా యజమాని. అయినప్పటికీ ప్రతిరోజూ ఆస్పత్రికి వస్తూనే వుంది మాషా. ఇలా ఏడాదిగా జరుగుతోంది. మాషా కథ విన్న వారికెవరికైనా జపాన్‌లో ఇదేమాదిరి తన యజమాని కోసం పదేళ్లు ఎదురుచూసిన హచికో గుర్తురాకమానదు. పత్రికల వాళ్లైతే దీన్ని రష్యా హచికో అని పిలవసాగారు. మాషా విశ్వాసానికి ముచ్చటపడిపోయిన ఓ కుటుంబం దాన్ని పెంచుకోవాలని చూసినప్పటికీ తిరిగి ఆస్పత్రికి వచ్చేసిందట. ఎప్పటికైనా దానికో మంచి యజమాని దొరుకుతాడన్న నమ్మకం వుందంటారు హాస్పిటల్ చీఫ్ వైద్యుడు. మనం కూడా అదే కోరుకుందాం.

గమ్మీ బొమ్మ

'ఏదైనా కొత్తగా చేయాలి' అని తపనపడే వారి జాబితాలో కెనడా నవలా రచయిత డగ్లస్ కూప్‌లాండ్ ముందుంటాడు. ఈయనగారు ఆర్టిస్టు కూడా. అక్కడే వచ్చింది చిక్కంతా. ఎప్పటిలా కళాఖండాలు తయారుచేస్తే కొత్తే ముంది? అనుకున్నట్టున్నాడు. ఫైబర్ గ్లాస్‌తో చేసిన ఏడడుగుల తల మీద ప్రయోగం చేయాలనుకున్నాడు. 'నల్లగా నిగనిగలాడిపోయే ఈ తల మీద ఎవరైనా సరే బబుల్ గమ్ అతికించొచ్చు' అని పిలుపిచ్చాడు. అంతేకాదు. దీన్ని వాంకోవర్ ఆర్ట్ గ్యాలరీ బయట పెట్టించాడు. ఇక చూస్కోండి! బబుల్ గమ్ నమిలే అలవాటున్న ప్రతి ఒక్కరూ అక్కడికి రావడం...అప్పటి వరకు నమిలిన బబుల్‌గమ్ బయటకు తీసి బొమ్మ తల మీద అతికించడం... వెళ్లిపోవడం! ఆ గమ్మీ బొమ్మ చూడ్డానికి భలే వింతగా తయారైందనుకోండి. ఇప్పుడా తలను టొరంటోకి తరలించి మళ్లీ ఇలాగే ఓ పిలుపు ఇవ్వాలనుకుంటున్నాడు కూప్‌లాండ్. అప్పుడే కాదులెండి జనవరిలో.

బార్బీ ... బొద్దుగా ...

సన్నగా నాజూగ్గా కనిపించే బార్బీ బొమ్మంటే ఎంత క్రేజో ఆడపిల్లలకు. అయితే అది పెద్ద సమస్యగా కూడా తయారైంది. చిన్నతనం నుంచి ఆ బొమ్మతో ఆడుకునీ...ఆడుకునీ ... తాము కూడా అచ్చం అలాగే సన్నగా వుండాలని కోరుకోవడంతో సమస్యలు మొదలయ్యాయి. దాంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు కూడా వెల్లువెత్తాయనుకోండి. అయితే ఇప్పుడా బక్కబల్చటి బార్బీకి పోటీగా బొద్దు బార్బీ వచ్చింది మార్కెట్‌లోకి. ఈ బొమ్మ ఓ మామూలు అమెరికన్ అమ్మాయిలా కొంచెం బొద్దుగా...మొటిమలు, మచ్చలు, మామూలు బట్టలతో... వుంటుంది. ఇంతకీ ఈ బొమ్మను సృజించిన బ్రహ్మ ఎవరనుకుంటున్నారు?! నికొలాయ్ లేమ్. ఈ బొమ్మలను చూసిన చిన్నారులు ... 'ఇది అచ్చంగా మా అక్క/చెల్లిలా వుంది...' అని.

◆ చూద్దామా

ఆలయాల వనం వారణాసి



పూర్వం రవాణా సౌకర్యాలు అంతగా వుండేవి కావు. సుదూరపు పుణ్యక్షేత్రాలను సందర్శించాలన్నా కాలి నడకే శరణ్యం. అలాంటి పరిస్థితుల్లో కాశీ ప్రయాణమంటే ఆఖరి ప్రయాణం కిందే లెక్క. అయినప్పటికీ... ప్రాణాలకు వెరవక... అడవులు, నదులు, పర్వతాలు దాటి ... కాశీ చూడటానికి వచ్చేవారంటేనే దీని ప్రాముఖ్యత ఏంటో అర్థమౌతోంది. అక్కడ అడుగడుగున కనిపించే ఆలయాలు, స్నాన ఘట్టాల వివరాలు ఈ వారం.

'కాశీ'గా పిల్చుకునే 'వారణాసి' ఉత్తర ప్రదేశ్‌లో వుంది. ఈ పట్టణ సౌందర్యం చూడాలంటే మాత్రం ఉదయానికల్లా అక్కడ వుండాలి. ఇక్కడ మాలవీయ బ్రిడ్జి మీద నుంచి చూస్తే ... గంగా నది వంపులతోపాటు ... అక్కడి ఆలయాల శిఖరాలు, వాటికి అద్దిన శిల్ప సౌందర్యం మీద సూర్యుని లేత కిరణాలు ప్రసరిస్తుంటే చూడ్డానికి చాలా బావుంటుంది. ఇది ప్రపంచంలోకెల్లా రమణీయమైన నదిగా భావిస్తారు.

గంగకు వరుణ, అసి అనే రెండు ఉపనదులు ఉన్నాయి. అవి ఇక్కడ గంగానదితో కలుస్తుండటంతో దీనికి వారణాసి అనే పేరు వచ్చింది. కాశీపట్నం క్రీస్తుపూర్వం 1200 సంవత్సరాల నాటిదని చెపుతారు. హిందూ దేశాన్ని దర్శించిన చైనా యాత్రికులు పాహియాన్, హుయాన్‌త్సాంగ్‌లు వారణాసిని విపులంగా వర్ణించారు. కాశీ నగరం సంగీత నాట్య కళలకు కేంద్రం. బనారస్ కళాకారుల బాజ్, తబలా, షెహనాయ్, సారంగి వాయిద్యాలు ప్రపంచ ఖ్యాతి గాంచాయి.

అణువణువునా ఆధ్యాత్మికత

కాశీ క్షేత్రపు ఆధ్యాత్మిక పార్శ్వమంతా గదౌలియాలోనే వుంది.కొందరు తెల్లవారుజామునే గంగా స్నానం, సూర్య నమస్కారం చేస్తారు. అప్పుడే ఉదయిస్తున్న సూర్య భగవానుని లేలేత కిరణాలు శరీరాన్ని తాకినప్పుడు ఏదో నూతన చైతన్యం ఉత్తేజపరుస్తుంది. స్నానమాచరించి వచ్చేవారికి అడుగకనే కుంకుమ దిద్ది దక్షిణలు స్వీకరించే తాటాకుల చత్రాలను ధరించిన విప్రవరులు, నదీ తీరాన పడవల వారి కేకలు, కాషాయ దుస్తులు ధరించిన యోగినులు, ఒంటి నిండా విభూదితో సాధువులు దర్శనమిస్తారు. ఇంకా వివిధ వేషభాషలతో యాత్రికులతో, ఆవులూ మేకలతో స్నాన ఘట్టాలన్నీ సందడిగా, కోలాహలంగా ప్రత్యేకంగా కనిపిస్తాయి.

స్నాన ఘట్టాలు

కాశీ నగరంలో 64 స్నాన ఘట్టాలున్నాయి. వీటిలో అస్సి, దశాశ్వ మేథ, మణి కర్ణిక, పంచ గంగ, వరుణా సంగమం అనే స్నాన ఘట్టాలు పంచతీర్థాలుగా ప్రసిద్ధి చెందాయి. అన్నింటికంటే పురాతనమైనది హరిశ్చంద్ర ఘాట్. హరిశ్చంద్రుడిక్కడే శవ దహనాలు చేసి విశ్వామిత్రునికిచ్చిన మాట నిలబెట్టుకున్నాడట. ఇక్కడకు రోజంతా శవాలు వస్తూనే ఉంటాయి. కొత్తగా చూసేవారికి ఇక్కడ శవాన్ని తీసుకొచ్చే దృశ్యం విచిత్రంగా అనిపిస్తుంది. ఆటో పైభాగంలో శవాన్ని కట్టి, లోపల బంధువులు కూర్చుని వస్తారు. ఇక్కడ హరిశ్చంద్రుడు, చంద్రమతి విగ్రహాలు ఉన్నాయి. మెట్లెక్కి పైకెళ్తే దక్షిణ భారతదేశంలోని దేవాలయాల నిర్మాణం ఎలా వుంటుందో అలాంటి దేవాలయం ఒకటుంది. ఎదురుగా శివ లింగం, ఒక పక్క విఘ్నేశ్వరుడు, మరో పక్క పార్వతి, వీరి వెనుక భాగాన శయనిస్తున్న శివుని పూజిస్తున్నట్లున్న రుషుల శిల్పం ఉంటుంది. ఇక్కడే సభలు నిర్వహించడానికి పెద్ద హాలు, దీనికి నాలుగడుగుల దూరంలో శంకర మఠం ఉన్నాయి. ఈ ప్రాంతంలో దక్షిణాది వారు అందునా తెలుగువారు కూడా చాలామందే ఉన్నారు. స్నాన ఘట్టాలన్నీ నదిమీద ప్రయాణిస్తూ దర్శించవచ్చు. ఇక్కడ గంగానదీ తీరాన బారులు తీరి వున్న స్నానఘట్టాలలో ఒక చివర అస్సీ ఘాట్, మరో చివర పంచ గంగా ఘాట్ ఉన్నాయి. దాదాపు మధ్యలో దశాశ్వమేధ ఘాట్ ఉంది. ఇక్కడి వినాయక విగ్రహం చాలా పురాతనమైనది. ముందుగా భక్తులు ఇక్కడ పూజలు నిర్వహించిన తర్వాతే విశ్వనాథుని దర్శించుకుంటారు.

దశాశ్వనాథ్ ఘాట్

విశ్వనాథ మందిరం

వారణాసిలో చిన్నవీ పెద్దవీ అనేక దేవాలయాలు కొన్ని వందలు కనిపిస్తాయి. పూర్వం

కాశీయాత్ర చేసినవారు, స్తోమత ఉంటే ఇక్కడ ఒక లింగప్రతిష్ఠ చేసేవారట. అలాంటివి ఇక్కడ కొన్ని వేల లింగాలు కనిపిస్తాయి. ఇక రాజులు, సంపన్నులైతే ఆలయమే నిర్మించేవారట. విశ్వనాథ మందిరం వెనుక 48 స్తంభాల మీద నిర్మించిన మంటపం, పెద్ద నందీశ్వరుని విగ్రహం కూడా ఉంది. 18వ శతాబ్దపు విధ్వంసంలో అప్పటి పూజారులు విశ్వనాథుని లింగాన్ని ఇక్కడ నూతిలో పడేసి రక్షించుకున్నారట. దీనిని 'జ్ఞాన్ వపి' అంటారు. పరిస్థితులు చక్కబడ్డాక దాని పక్కనే ఉన్న చిన్న మందిరంలోనికి మార్చుకున్నారని కథనం. మందిర ప్రధాన ద్వారం దాటగానే కుడివైపున్న గర్భగుడికి నాలుగు వైపులా ద్వారాలున్నాయి. మధ్యలో రెండడుగుల లోతులో పానవట్టం వెండితో తాపడం చేసి ఉంది. అందులోనే అనాదిగా అర్చింపబడుతున్న శివలింగముంది. పక్కనే విఘ్నేశ్వరుని, శని విగ్రహాలున్నాయి.

కాశీ అన్నపూర్ణ మందిరం

విశ్వనాథుని మందిరంలోనే అన్నపూర్ణాదేవి విగ్రహం కూడా ఉంది. ఇదికాక కొంచెం దూరంలో 18వ శతాబ్దంలో నిర్మించిన పెద్దదైన కాశీ అన్నపూర్ణాదేవి ఆలయం కూడా ఉంది. నల్లరాతితో మలచిన విగ్రహం అలంకరణతో కళకళలాడుతూ ఉంటుంది. ఆలయం చుట్టూ ప్రాకారం, విశాలమైన మండపం, ఒకపక్క వరుసగా నిర్మించిన దేవతా విగ్రహాలున్న గదులున్నాయి. గర్భగుడి ముందు చాలా పెద్ద గంట ఉంది. ఇక్కడున్న మరో విగ్రహం శివునికి భిక్ష ఇస్తున్నట్లుగా ఉన్న బంగారు విగ్రహం. ఈ విగ్రహాన్ని దీపావళి ఉత్సవాల మూడు రోజులు మాత్రమే భక్తులు దర్శించుకోవడానికి వీలుకలుగుతుంది.

కోతుల గుడి

వారణాసిలో అస్సీ ఘాట్ చూడవలసిన స్థలం. ఇక్కడే తులసీదాస్ తన 'రామ చరిత మానస్'ను రచించాడు. 18వ శతాబ్దపు దుర్గామాత మందిరంలో అర్చనామూర్తి అమ్మవారి విగ్రహం ప్రసన్న వదనంతో ఉంటుంది. ఈ ఆలయం వెలుపల వందలకొద్దీ కోతులున్నాయి. అందుకే దీనిని 'కోతుల గుడి' అనికూడా అంటారు. ఈ మందిరం పక్కగా భద్రకాళి విగ్రహం ఉగ్ర రూపంతో ఉంటుంది. దీని పక్కగా చిన్న చిన్న శివలింగాలతో ఒక మంటపం ఉంది.

కేదారీశ్వర్ మందిరం

కేదారీశ్వర్ మందిరం లాలీఘాట్ పక్కనే ఉన్న కొండమీద ఉంది. ఆలయం లోపల పానవట్టంలోని లింగాకృతి రెండు భాగాలుగా ఉంటుంది. ఒక భాగం కేదారేశ్వరుడు, మరో భాగం గౌరీదేవి. గర్భ గుడి వెనుక లక్ష్మీనారాయణ విగ్రహాలున్నాయి. ఒక పక్క నల్లరాతితో మలచిన వింధ్యవాసిని విగ్రహముంది. ఇక్కడి పాల రాతి పలకల మీద తెలుగు, తమిళం, కన్నడ భాషలలో పేర్లు చెక్కివున్నాయి.

నిలువెత్తు కాలభైరవ

ఈ ఆలయం ఎక్కడున్నదో తెలుసుకోవడం చాలా కష్టం. అందుకేనేమో దాడులలో కాశీలోని ఆలయాలన్నీ విధ్వంసానికి గురైనా కాలభైరవ ఆలయం మాత్రం ఆ దాడుల నుండి తప్పించుకుంది. ఇది చాలా ప్రాచీనమైన కట్టడం. నాలుగు వైపులా కాళీ స్థలం, మధ్యలో చిన్నగుడి, లోపల నల్లరాతితో చేసిన నిలువెత్తు కాలభైరవ విగ్రహం భీతి గొల్పుతూ ఉంటుంది. ఇక్కడ గుడి చుట్టూ దీపాలు వెలిగిస్తారు.

రామకృష్ణ ఆశ్రమం

ఈ ఆశ్రమాన్ని వివేకానందుడు స్థాపించాడట. దీన్ని సేవాశ్రమం అనికూడా అంటారు. ఆశ్రమ స్వీకారం చేసినవారికి వసతి ఏర్పాట్లున్నాయి. రామకృష్ణునికి మందిరం ఉంది. ఇక్కడ కాళీమాతకు నిత్యం పూజలు, భజనలు ఒక క్రమ పద్ధతిలో జరుగుతాయి. ఈ ఆశ్రమానికి గ్రంథాలయం, ఆసుపత్రి కూడా వున్నాయి.

తులసీ మందిర్

ఇది దుర్గాదేవీ, సంకట నివారణ్ మందిరాలకు మధ్యలో ఉంటుంది. పాలరాతితో విశాలంగా ఉన్న హాల్లో సీతారామ లక్ష్మణ హనుమంతుల విగ్రహాలున్నాయి. వీటికి ఎడమ పక్కగా నిలువెత్తు తులసీదాసు బొమ్మ రామాయణగానం చేస్తున్నట్టుగా కదులుతూ ఉంటుంది. వెనక స్పీకర్‌లోనుండి రామాయణ గానం వినిపిస్తూ ఉంటుంది. ఈహాలు పైఅంతస్తులో గోడలకున్న పాలరాతి పలకలపై తులసీదాస్ రామాయణం చెక్కారు. మరో హాల్లో రామాయణ గాథలోని అనేక ఘట్టాలు బొమ్మల రూపంలో చెక్కబడి ఉన్నాయి. ◆


గౌరీ కేదారేశ్వర్ ఆలయం

దుర్గా టెంపుల్

బజ్జో... కన్నా

◆ కథ

■ డా॥ శమంతకమణి

మిట్ట మధ్యాహ్నం... సూర్య కిరణాలు ప్రపంచాన్ని తీక్షణంగా చూస్తున్నాయి. కరెంటు కోత వలన, సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొద్దో గొప్పో ఆర్థిక స్థోమత ఉన్నవాళ్లు ఇన్వర్టర్‌లు ఏర్పరచుకున్న కారణంగా తాత్కాలికంగా ఉపశమనం లభిస్తుంది. ఎండలకు భయపడి జనాలు బయటకు రావడం లేదు. గుంటూరు బస్టాండ్‌లో జనం పలచగా వున్నారు. బస్సులు వస్తూ పోతూ ఉన్నాయి. ప్లాట్‌ఫారంపై ఎప్పటి నుంచో వున్నారు రంగడు, చిట్టి, వాళ్ల బిడ్డ రమేష్. తల్లి ఒడిలో ఒదిగి వున్నాడు. పిల్లవాడిని పొదివి పట్టుకుని కూర్చుంది చిట్టి. దాదాపు 3 గంటల నుండీ వాళ్లు అక్కడే వున్నారు. రంగా మాత్రం అప్పుడప్పుడూ లేచి బస్టాండ్ బయట వరకు వెళ్లి వస్తున్నాడు. అతని కళ్లలో ఎదురు చూపు, నిరాశ పోటీ పడుతున్నాయి. భర్త మనస్థితితో సంబంధం లేకుండా మౌనంగా కూర్చుంది చిట్టి. ఆమె మనసు ఆశ నిరాశలకతీతంగా వుంది. అప్పుడప్పుడూ మాత్రం తన ఒడిలో ప్రశాంతంగా వున్న కొడుకుని దగ్గరకు తీసుకుంటున్నది. వేడి గాలి పిల్లవాడికి తగలకుండా చీరె చెంగు బిడ్డ చెవి చుట్టూ కప్పింది. కాళ్లు తిమ్మిర్లు అనిపించినప్పుడు కాస్త అటూ ఇటూ కదుపుతుంది.

సాయంత్రం ఆరయ్యింది. ఎండ తీక్షణత తగ్గినా, వేడి గాలులు తగ్గ లేదు. మరీ చీకటి పడితే వినుకొండ చేరడం కష్టమవుతుంది. రమణ వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఓ నిర్ణయానికొచ్చిన రంగడు, భార్య దగ్గరకొచ్చాడు. ఎదురుగా చేతి బుట్టలో వున్న ప్లాస్టిక్ బాటిల్ తీసుకుని దగ్గరలో వున్న కుళాయి వద్దకు వెళ్లి నీళ్లు నింపుకొచ్చాడు.

'కొంచెం నీళ్లన్నా తాగు' అంటూ భార్యకు అందించాడు. వద్దన్నట్లు తల అడ్డంగా ఆడించి, కొడుకుని దగ్గరకు తీసుకుంది.

మరేం మాట్లాడకుండా రంగడు చేతి బుట్ట, సంచి తీసుకుని ముందుకడుగు వేశాడు. భర్త గమనం అర్థం చేసుకున్న చిట్టి, జాగ్రత్తగా బిడ్డను భుజం మీదకు ఎత్తుకుంది. చెవుల చుట్టూ గుడ్డను సరిచేసింది. ఎప్పటినుంచీ కూర్చుని వుందో, కాళ్లు తిమ్మిర్లు పట్టాయి. రెండు నిమిషాలు అక్కడే బెంచి ఆధారంగా నిలబడి భర్తను అనుసరించింది.

వినుకొండ వెళ్లే ప్యాసింజర్ బస్సు వచ్చింది. పెద్దగా ప్రయాణీకులు లేరు. అందుకే తోపులాట లేకుండా ఒక్కొక్కరు ప్రశాంతంగా ఎక్కుతున్నారు.

రంగడు ముందుగా ఎక్కి చేతి సంచులు రెండూ డ్రైవర్ ప్రక్కనున్న సింగిల్ సీటు ముందు పెట్టాడు.

వెనక్కి తిరిగి బస్సు మెట్ల దగ్గరున్న భార్యకు చేయి అందించాడు. చీరె కుచ్చిళ్లు అడ్డుపడకుండా భుజం మీదనున్న బిడ్డకు ఇబ్బంది కలగకుండా నెమ్మదిగా బస్సు ఎక్కింది చిట్టి. స్త్రీల కోసం కేటాయించిన వరుసలో కూర్చుంది. రమేష్ కాళ్లు కిటికీవైపు పెట్టి, ఒడిలో పిల్లాడి మెడ నొప్పి పెట్టకుండా భద్రంగా సర్దింది. ఒడిలో వున్న కొడుకు గుండెలపై చేయి వేసి... 'బజ్జో.. కన్నా.. మూడు గంటల్లో మన ఇంటికి వెళ్లిపోతాం' అంది.

ఆమెకు గుండెల్లో దుఃఖం తన్నుకొస్తుంది. చీరె కొంగుతో కనుచివరలు తుడుచుకుంది. సీట్‌రాడ్‌పై వెనక్కి తల వాల్చింది. కన్నీరు ఆగడం లేదు.

ఆమె ఎందుకు ఏడుస్తుందో అర్థంకాలేదు రఘుకి. అతను కూడా వినుకొండ బస్సు ఎక్కాడు. బస్సు ఎక్కే ముందు ఆమెను గమనించాడు. ఆమె భర్త ఎందుకు ఒక్కడే ముందు కూర్చున్నాడో... ఆమె ఎందుకు దుఃఖపడుతుందో అర్థంకాలేదు.

నాకెందుకు అనుకున్నాడు రఘు. కానీ ఎందుకో మనస్కరించలేదు. చేతిలో మ్యాగ్‌జైన్ తిరగేస్తూ... ఆమెను, ఆమె భర్తను గమనించసాగాడు.

'టికెట్.. టికెట్' అన్న కండక్టర్ కేకకు కళ్లు తెరిచిందామె. ఒడిలో బిడ్డను ఓ పక్కకు జరిపింది. ఏమ్మా? ఏ ఊరు? అడుగుతున్న కండక్టర్‌కి సమాధానం ఇవ్వకుండా ముందున్న భర్తను చూపించింది.

ముందుకు నడిచాడు కండక్టర్.. 'టికెట్.. టికెట్' ఆమె భర్త వద్ద మరలా అన్నాడా కండక్టర్. అవేం పట్టించుకోకుండా రోడ్డుమీదకు ముందుకు చూస్తున్నాడతను. 'ఏం బాబు.. టికెట్ అడిగితే మీ ఆవిడ నిన్ను చూపించింది. నువ్వేం మాట్లాడవు? విసుగ్గా అన్నాడు కండక్టర్.

షర్ట్ జేబులో నుంచీ కొంత డబ్బు తీసి.. 'వినుకొండ. రెండు టిక్కెట్లు సారు' అన్నాడామె భర్త. వెనక్కి తిరిగి చూశాడా కండక్టర్. తల్లి ఒడిలో నున్న బిడ్డకు 10-12 ఏళ్లుండవచ్చు. 'పిల్లాడికి కూడా తీయాలయ్యా..' పిల్లాడిని

" అక్కడే బెంచి మీద కూర్చుని, బస్సులో చదవలేకపోయిన పత్రిక తెరిచాడతను. ఓ అరగంట తర్వాత వచ్చిన మిత్రుడితో కుశల ప్రశ్నలయ్యాక... స్కూటర్ మీద బయలదేరారిద్దరు. రఘు... 'మా పొలం కౌలు చేసే రైతు కొడుకుకు బాగాలేక గుంటూరు తీసుకెళ్లారు. ఈ పూట వచ్చేస్తామన్నారు. ఇంటికి వెళ్లే దారిలోనే వాళ్ల ఇల్లు... ఓసారి పలకరించి వెళదాం.. రేపంతా బిజీ' అంటూ స్కూటర్‌ని ఓ చిన్న ఇంటి ముందాపాడతను. "

అక్కున చేర్చుకుంది చిట్టి. 'మరింక లేవు బాబు..' నిస్సహాయంగా అన్నాడామె భర్త.

'చూడు స్వామీ.. బస్సు ఎక్కే ముందే చూసుకోవాలి. డబ్బుల్లేకుండా ఎలా ఎక్కారు. చూడు చూడే.. ఎక్కడో ఒక చోట ఉంటాయి.' కాస్త విసుగ్గా అన్నాడు కండక్టర్.

'నిజంగా లేవు సారు' దీనంగా అన్నాడు రంగడు.

'చూడు బాబు.. ఎక్కడన్నా చెకింగ్ జరిగిందనుకో.. నీకు జరిమానా. నాకు పనిష్‌మెంట్. ఇవన్నీ నాకు అవసరమా? డబ్బులుంటే ముగ్గురికీ టిక్కెట్ తీయి. లేకుంటే వచ్చే స్టాప్‌లో దిగిపోండి. అక్కడి వరకే టిక్కెట్ ఇస్తాను' కరాఖండిగా అన్నాడు కండక్టర్.

దుఃఖం ఆగలేదు చిట్టికి. భర్త అబద్ధం ఆడటం లేదు. డబ్బు తెస్తానన్న రమణ మూడు గంటలు బస్టాండ్‌లో కూర్చోపెట్టేశాడు తప్ప, మనిషి కనబడలేదు. ఏమో! అతను కూడా తమలాగే రోజువారీ కూలీ. ఆపదలో ఆదుకోగల మనస్సు ఉండవచ్చు గానీ, ప్రపంచాన్ని శాసిస్తున్న డబ్బుని, ఎక్కడి నుంచి క్షణాల్లో రప్పించగలడు?

" 'టికెట్.. టికెట్' ఆమె భర్త వద్ద మరలా అన్నాడా కండక్టర్. అవేం పట్టించుకోకుండా రోడ్డుమీదకు ముందుకు చూస్తున్నాడతను. 'ఏం బాబు.. టికెట్ అడిగితే మీ ఆవిడ నిన్ను చూపించింది. నువ్వేం మాట్లాడవు? విసుగ్గా అన్నాడు కండక్టర్. షర్ట్ జేబులో నుంచీ కొంత డబ్బు తీసి.. 'వినుకొండ. రెండు టిక్కెట్లు సారు' అన్నాడామె భర్త. వెనక్కి తిరిగి చూశాడా కండక్టర్. తల్లి ఒడిలో నున్న బిడ్డకు 10-12 ఏళ్లుండవచ్చు. 'పిల్లాడికి కూడా తీయాలయ్యా..' పిల్లాడిని అక్కున చేర్చుకుంది చిట్టి. 'మరింక లేవు బాబు..' నిస్సహాయంగా అన్నాడామె భర్త. "

ఇవేవీ తెలియని ఆ పసివాడు ప్రశాంతంగా తల్లి ఒడిలో విశ్రమించే వున్నాడు. బిడ్డ కదలినట్లనిపించింది. కిటికీ కాస్త తెరచింది. పిల్లాడిని జో కొడుతూ 'బజ్జో నాన్నా.. బజ్జో' అంది.

'ఏమయ్యా చెప్పేది నీకే. టిక్కెట్లు తీసుకుంటావా? దిగిపోతారా?' అరిచాడు కండక్టర్.

రఘుకి కాస్త ఇబ్బంది అనిపించింది. ఆ దంపతులను చూస్తుంటే వారు నిజమే చెబుతున్నారనిపించింది. అతని ముఖంలో దైన్యం.. ఆమె ఎప్పటి నుంచో దుఃఖపడుతుంది.

'కండక్టర్ గారు.. వాళ్లకు మూడు టిక్కెట్లివ్వండి. మిగిలిన డబ్బు నేనిస్తాను' అంటూ పర్సు తీశాడు రఘు.

'డబ్బులెవ్వరిస్తే ఏమిటి?' నా పని నేను చేస్తున్నాను అనుకుంటూ టిక్కెట్లు ఇచ్చి తన సీట్‌లో కూర్చున్నాడు కండక్టర్.

'కృతజ్ఞతగా చూసిందామె రఘు వైపు. వెంటనే పిల్లాడిని దగ్గరకు హత్తుకుని 'బజ్జో నాయనా' అంది. ఆమె ఎందుకలా అంటుందో అర్థం కావడం లేదు రఘుకి. ప్రయాణమంతా... ఆమె దుఃఖంతో బజ్జో నాన్నా అంటూ జో కొడుతూనే ఉంది.

వినుకొండ వచ్చింది. భర్త చేతి సంచులు పట్టుకుని దిగాడు. బిడ్డను జాగ్రత్తగా పొదివి పట్టుకుని ఆమె కూడా దిగింది. వెనుకగా రఘు. నిస్తేజంగా నడుస్తున్న ఆ దంపతులను చూస్తూ... తన కోసం బస్టాండ్‌కి వస్తానన్న మిత్రుడి కోసం ఫోన్ చేశాడు రఘు. పనుండి కాస్త ఆలస్యమయిందని, తాను రావడానికి మరో అరగంట పడుతుందని, అంతవరకూ బస్టాండ్‌లోనే ఎదురుచూడమని చెప్పాడా మిత్రుడు.

అక్కడే బెంచి మీద కూర్చుని, బస్సులో చదవలేకపోయిన పత్రిక తెరిచాడతను. ఓ అరగంట తర్వాత వచ్చిన మిత్రుడితో కుశల ప్రశ్నలయ్యాక... స్కూటర్ మీద బయలు దేరారిద్దరు.

'రఘు... మా పొలం కౌలు చేసే రైతు కొడుకుకు బాగాలేక గుంటూరు తీసుకెళ్లారు. ఈ పూట వచ్చేస్తామన్నారు. ఇంటికి వెళ్లే దారిలోనే వాళ్ల ఇల్లు... ఓసారి పలకరించి వెళదాం.. రేపంతా బిజీ' అంటూ స్కూటర్‌ని ఓ చిన్న ఇంటి ముందాపాడతను.

ఇంటి ముందు దృశ్యాన్ని చూసి బిత్తరపోయాడు రఘు. కారణం... ఇందాక బస్సులో తనతో ప్రయాణం చేసిన దంపతులే వాళ్లు. పిల్లాడు ఎదురుగా చాపమీద పడుకోబెట్టి వున్నాడు. వెనుకగా దీపం. పక్కనే పిల్లాడిపై చేయి వేసి 'బజ్జో కన్నా.. బజ్జో' అంటూ గొణుగుతున్న ఆ తల్లి.

అంబులెన్స్‌లో తీసుకురాగలిగే ఆర్థిక స్థోమత లేని ఆ చిన్న రైతు, అతని భార్య.. శవం అని తెలిస్తే బస్సులో తీసుకెళ్లనీయరని భావించి ప్రాణం పోయిన బిడ్డను పదిలంగా ఊరు చేర్చడానికి పడ్డ ప్రయాస, ఆపుకున్న దుఃఖం, ప్రత్యక్షంగా చూసిన రఘుకి హృదయం ద్రవించి పోయింది.

ఊపిరున్న మనిషిని డబ్బులుంటే ఎంత దూరమైనా మోసుకెళ్లే వాహనాలు, ఊపిరిలేని వాళ్లను శవంగా భావించి తీసుకెళ్లనీయరు. అంబులెన్స్‌లు సైతం అధిక ధరలు చెబుతారు. ఎందుకో? మనుష్యుల మూఢత్వానికి పరాకాష్ట అయిన ఈ స్థితి నుండీ బయటపడలేని తమ ఆర్థిక దుస్థితికి తల్లడిన ఆ దంపతుల దుఃఖం ఖరీదు ఎంత? ■

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించి రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించి పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజామాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

వేడివేడిగా...

స్వీట్‌కార్న్ సూప్

కావలసినవి: స్వీట్ కార్న్ : కప్పు, ఉల్లికాడలు : అరకప్పు, కూరగాయలు ఉడికించిన నీళ్లు : మూడు కప్పులు, టమాటా సాస్ : ఐదు చెంచాలు, దాల్చిన చెక్క : కొద్దిగా, జీలకర్ర : చెంచా, మిరియాలు : చెంచా, ఉల్లిపాయ తరుగు : అరకప్పు, టమాటా : ఒకటి, పచ్చిమిర్చి : నాలుగు , ఉప్పు, పంచదార : తగినంత

తయారీ విధానం: ముందుగా ఉల్లిపాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలు తరిగి మిక్సీలో వేసి ముద్దగా వేయాలి. అలానే శుభ్రంగా ఉన్న వస్త్రంలో దాల్చిన చెక్క, జీలకర్ర, మిరియాలు తీసుకొని మూటలా కట్టాలి. ఉల్లిపాయ ముద్ద, సుగంధ ద్రవ్యాల మూట, మొక్కజొన్నలను కూరగాయలు ఉడికించిన నీళ్లలో పోసి పొయ్యిమీద పెట్టాలి. కొద్దిసేపటికి ఉప్పు, ఉల్లికాడలు, టమాటాసాస్ వేసి బాగా మరిగించాలి. సూప్ చిక్కగా అవుతుంది. అప్పుడు సుగంధ దినుసుల మూటను తీసేసి వేడివేడిగా తీసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

క్యారెట్ సూప్

కావలసినవి : క్యారెట్ : పావుకిలో, వెన్న తీసిన పాలు : 2 కప్పులు, నీళ్లు : 2 కప్పులు, చక్కెర : 1 చెంచా, మిరియాల పొడి : అర చెంచా, ఉప్పు : తగినంత

తయారీ విధానం :

క్యారెట్లను చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. గిన్నెలో నీళ్ళు పోసి స్టౌ మీద పెట్టాలి. నీళ్లు మరుగుతుండగా క్యారెట్ ముక్కలు వేయాలి. అరగంట పాటు ఉడికించిన తరువాత దించేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. దీనిని గిన్నెలో పోసి మళ్లీ స్టౌ మీద పెట్టాలి. పది నిమిషాలు మరిగాక పాలు, చక్కెర, ఉప్పు వేసి బాగా కలపాలి. బాగా మరిగాక మిరియాల పొడి చల్లుకుని దించాలి. సూప్ తాగేటప్పుడు క్రీమ్ వేసుకుంటే చాలా బాగుంటుంది.

ఆలూ సూప్

కావలసినవి:

బంగాళదుంపలు : 1/4 కిలో, ఉల్లిపాయలు : 2 పెద్దవి, పచ్చిమిర్చి : 3 కాయలు, చింతపండు : 50 గ్రా. నూనె, పసుపు, ఉప్పు, బెల్లం : తగినంత, వెల్లుల్లిపాయ : 1, మెంతులు : 1/2 చెంచా, కారం : 1 చెంచా, తాలింపులు : తగినంత, కరివేపాకు : తగినంత

తయారీ విధానం :

చింతపండు కడిగి నీటిలో నానపెట్టాలి. బంగాళ దుంపలు, పచ్చిమిర్చి, ఉల్లిపాయల్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. గిన్నెలో నూనెపోసి కాగిన తర్వాత వెల్లుల్లి చిదిపివేయాలి. తరువాత మెంతులు వేసి వేగిన తర్వాత తాళింపులు, కరివేపాకు వేసి వేగిన తర్వాత తరిగిన ఉల్లి, దుంప, మిర్చి ముక్కలు కూడా వేసి కాస్త వేగిన తర్వాత చింతపండు రసం చిక్కగా చేసి పోయాలి. ముక్కలన్నీ ఉడికిన తర్వాత ఉప్పు, పసుపు, కారం కూడా వేసి బాగా మరగనిచ్చి కొత్తిమీర చల్లుకొని దింపుకోవాలి.

పెసర సూప్

కావలసినవి : మొలకెత్తిన పెసలు : కొద్దిగా, పెసర పప్పు : పావు కప్పు, అల్లం తురుము : చెంచా, వెల్లుల్లి పలుకులు : అరచెంచా, జీలకర్ర : కొద్దిగా, కొత్తిమీర తురుము : రెండు చెంచాలు, వెన్న : చెంచా, ఉప్పు : రుచికి తగినంత, మిరియాల పొడి : అరచెంచా

తయారీ విధానం : పెసరపప్పును ఉడికించి మెత్తగా మెదపాలి. అందులో వెన్న, జీలకర్ర, దోరగా వేయించిన వెల్లుల్లి పలుకులు, అల్లం తురుము, కాసిని నీళ్ల చేర్చి పలుచగా చేసుకుని పొయ్యి మీద పెట్టాలి. సూప్ పొంగు రాగానే తగినంత ఉప్పు, మిరియాల పొడి చేర్చాలి. మొలకెత్తిన పెసల్ని ఐదు నిమిషాలు ఉడికించి సూప్‌లో వేసి, కొత్తిమీర రుసుముతో అలంకరిస్తే చాలు. పోషకాలనందించే పెసరసూప్ సిద్ధం.

చవుడు భూముల్లో వరి సాగు

నారు పోసిన వాడు నీరు పోయకపోతాడాలి' అని నాడంటే 'జన్మనిచ్చిన వాడు పుడ్డు పెట్టక పోతాడా' అని నేడనేవారు ప్రతి వారికీ ఎప్పుడో ఒకప్పుడు తారస పడే ఉండి ఉంటారు. పుడ్డు సంగతేమో గాని జనాభా పెరుగుతోంది గానీ వారికి అవసరమైన ఆహారాన్ని పండించేందుకు అవసరమైన భూమి పెరగటం లేదు. పంటల కోసం అడవులను నరికి వేస్తే అసలుకే మోసం వస్తుందన్న సంగతి తెలిసిందే.

ప్రపంచంలో 135 కోట్లతో అత్యధిక జనాభా ఉన్న దేశం చైనా, 120 కోట్ల మంది ఉన్న మన దేశం ద్వితీయ స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. అలాంటి చోట్ల ఒక పూట విస్తరి లేవాలంటే ఎంత ధాన్యం కావాలి. గత పది సంవత్సరాలలో మన దేశంలో భారత ఆహార సంస్థ వివిధ రాష్ట్రాలకు కేటాయించిన ఆహార ధాన్యాల మొత్తాలలో అక్షరాలా పందొమ్మిది కోట్ల ఎనభై ఎనిమిది లక్షల ఎనభై ఒక్కవేల నూటపది టన్నులను రాష్ట్రాలు తీసుకు వెళ్లలేదని సమాచార హక్కు చట్ట ప్రకారం అడిగిన దానికి ఆ సంస్థ బదులిచ్చింది. అంటే మన దేశంలో అందరికీ కడుపు నిండి ధాన్యాన్ని తీసుకొనే వారు లేనట్లా?

దున్నటానికి వీలైన భూమి చైనాలో ఒక వ్యక్తికి సగటున 0.08, మన దేశంలో 0.13, అమెరికాలో 0.49 హెక్టార్ల వంతున ఉన్నట్లు ప్రపంచబ్యాంకు తాజా సమాచారం వెల్లడించింది. మరి ఈ దేశాల్లో పంటల దిగుబడులు ఎలా ఉన్నాయంటే బియ్యం, గోధుమలు, బార్లీ, ఓట్ల వంటి ధాన్యాలు వరుసగా హెక్టారుకు 5934, 2975, 7340 కిలోల చొప్పున ఉత్పత్తి అయ్యాయి. ఈ మూడు దేశాల్లోనూ గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క చైనాలోనే క్రమంగా పెరుగుదల కనిపించింది.

అక్కడి 135 కోట్ల జనాభాకు అవసరమైన తిండి, కావాల్సిన బట్టలు, నివాసాలు సమకూర్చటమంటే మాటలు కాదు. అయినా అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం నిరంతరం అదే తపనతో పని చేస్తుండబట్టే ఏటేటా వాటి లభ్యతను పెంచుతున్నది. కొన్ని సంవత్సరాల క్రితం సోషలిస్టు వ్యవస్థ పనిచేయదనే పిచ్చి ఊహలతో కొంత మంది చైనా కడుపు ఎవరు నింపుతారనే ప్రశ్నలు లేవనెత్తారు. దానికి తమ కడుపును తామే నింపుకుంటామని, ఇతరులపై ఆధారపడాలనుకోవటం లేదని చైనా సమాధానం చెప్పింది. నిజానికి ఆ విమర్శలను సవాలుగా తీసుకుంది. అనేక విజయాలు సాధించి విజయ పథంలో దూసుకుపోతోంది. ఆ క్రమంలో జరుగుతున్న వరి పరి శోధనలు సఫలమైతే మరో హరిత విప్లవం వచ్చినట్లే. బియ్యం దిగుమతిదారుగా ఉన్న చైనా ఎగుమతిదారుగా మారుతుందంటే అతిశయోక్తి కాదు.

చెన్ రిషెంగ్ 1986లో ఝాన్ జియాంగ్ వ్యవసాయ కళాశాల నుంచి పండ్ల మొక్కల నిపుణుడిగా పట్టా పుచ్చుకున్నాడు. తన టీచర్‌తో కలిసి సముద్రతీరాల్లోని మడ అడవులను చూసేందుకు ఒక బీచ్‌కు వెళ్లాడు. అక్కడ 1.6 మీటర్ల పొడవున ఉన్న ఒకే కాండం ఉన్న మొక్కలను చూశారు. వాటికి వరి గింజల వంటివి ఉన్నాయి. ఆశ్చర్య పోయిన టీచర్ దానిని మరింత నిశితంగా పరిశీలించి అది చవుడు, ఉప్పునేలల్లో పెరిగే అడవి ధాన్యంగా నిర్ధారణకు వచ్చారు. అవి ఒకే సమయంలో అవి పుష్పించటం, గింజ కట్టటం అసాధారణ విషయంగా గమనించారు. గింజలు చాలా పొడవుగా ఉన్నాయి. అది ఎంతో విలువైనదని, దానిని భద్రపరిచి సాగు వంగడంగా తయారు చేయవచ్చని టీచర్ చెన్‌కు చెప్పాడు.

వెంటనే రంగంలోకి దిగిన చెన్ ఆ అడవి వరి మొక్కల నుంచి 522 గింజలను సేకరించాడు. వాటిని సముద్ర తీరంలో రెండు మళ్లలో నాటాడు. సముద్ర తీరంలో ఆటుపోట్లు ఉంటాయి కనుక కొట్టుకు పోకుండా, చేపలు తినకుండా ఉండేందుకు ఒక మడికి చేపల వలను రక్షణగా అమర్చాడు. అనుకున్నట్లే ఒక మడిలోని మొక్కలను చేపలు తినివేశాయి. రెండవ మడిలోవి బతికాయి. ఆ మడిలోని 400 మొక్కలలో 51ని గింజలకు ఎంచుకొన్నాడు. అలా కొద్ది కొద్దిగా ప్రయోగాలు చేస్తూ 1991 నాటికి పది జాతులకు చెందిన 3.8 కిలోల ధాన్యాన్ని ఉత్పత్తి చేశాడు. దానికి సీ రైస్ 86' అని పేరు పెట్టాడు. తరువాత ఇంకా పరిశోధనలు కొనసాగించాడు. 2012లో మూడు ప్రాంతాలలో సీ రైస్ 86ను నాటాడు. ఐదు రోజుల తరువాత అవి బతకటాన్ని చూసి స్థానిక రైతులు అద్భుతంగా భావించారు. ఈ ఏడాది 133 హెక్టార్లలో సాగు చేశాడు.

తాను పండించిన బియ్యాన్ని పరీక్షించి నిర్ధారించాలని 2012లో బీజింగ్‌లోని పోషకాల పరిశోధనా సంస్థకు పంపాడు. సాంప్రదాయ బియ్యంలో కంటే వీటిలో పోషకాలు 64శాతం ఎక్కువ ఉన్నాయని తేలింది. ఈ ఏడాది మార్చి నెలలో ఇంటర్నేషనల్ సీ రైస్ బయోటెక్నాలజీ కంపెనీని చెన్ రీషెంగ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా 80 మంది పరిశోధకులతో ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా సాగు చేసేందుకు చైనా ప్రభుత్వం అనుమతించింది. చవుడు, ఉప్పు నేలలతో పాటు తీర ప్రాంతాలలో కూడా ప్రయోగిస్తారు. ప్రస్తుతం 52 సంవత్సరాల వయస్సున్న చెన్ నిర్మాణ కార్మికుడిగా, ఇతర పనులు చేస్తూనే 28 సంవత్సరాల పాటు ఒంటరిగానే ప్రయోగాలు చేశాడు. ఈ ప్రయోగం సఫలమైతే చైనాలోని పది కోట్ల హెక్టార్ల చవుడు, ఉప్పునీటి భూములు వరి పొలాలుగా మారతాయి. ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఒక టన్ను ధాన్యం ఉత్పత్తికి వెయ్యి ఘనపు మీటర్ల నీరు అవసరం. అదే సీ రైస్ 86 విజయ వంతమైతే మంచి నీటిని పొదుపు చేసుకోవచ్చు. రసాయనాలు, పురుగుమందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. తద్వారా భూసార కోతను నిరోధించవచ్చు. చవుడు భూములను పచ్చని పంట పొలాలుగా మార్చాలనే చెన్ కలలు నిజం కావాలని కావాలి.

- సత్య

అదో పెద్ద సవాల్

హాస్యం ఇష్టపడే పిల్లలు చార్లీ చాప్లిన్, మిస్టర్ బీన్, జిమ్ కేరీ..ని కూడా ఇష్టపడతారు. మనకు తెలుగు తెరమీద కామెడీని పండించడంలో అల్లరి నరేష్ తక్కువ కాదు. ఈ కుర్ర చాప్లిన్ తన ఇష్టాయిష్టాలను గురించి ఏం చెప్తున్నాడో చూద్దాం.

మీ జీవితంలో హీరో
ఇంకెవరూ.... మా నాన్నే

సలహా కోసం కలిసేది
నా స్నేహితులందరిలోకి... మా అన్నయ్యే ముందుంటాడు.

బాగా విచారించే విషయం
నేను దర్శకత్వం వహించిన చిత్రం ఒకటి నాన్న చూస్తే బావుండనుకున్నా. దురదృష్టవశాత్తు అది జరగలేదు. ఇప్పుడు నేను దర్శకత్వం చేసినా చూడ్డానికి ఆయన లేరు.

చిరకాల స్వప్నం
'పుష్పక్' లాంటి చిత్రంలో నటించాలని వుంది. ఇందులో మాటలు వుండవు. ప్రేక్షకులకు కేవలం హావభావాల ద్వారానే విషయం తెలియ చేయాల్సి వుంటుంది. ఇది చాలా పెద్ద సవాలు. అలాంటిది చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా.

ఇష్టమైన ప్రదేశం
బాలి

ఖాళీ సమయాల్లో గడపాలనుకునే చోటు
బోరా బోరా (ద్వీపం)

ప్రీతిపాత్రమైన వంటకం
థాయ్

ఇష్టమైన పాట
'ప్రాణం' చిత్రంలోని 'నిండు నూరేళ్ల సావాసం...'

ఇష్టమైన పుస్తకం
ది సీక్రెట్

క్రేజీగా చేసిన పనులు
పటాయాలో స్కై జంపింగ్

భయపడేది
పాములంటే భయం. స్క్రిప్టులో పాముల ప్రస్తావన చూసి కొన్ని సినిమాలు తిరస్కరించాను.

ప్రియురాలు...
ఒకవేళ వుంటే... ఈపాటికి పెళ్లి చేసుకుని పిల్లలతో ఆడుకుంటూ వుండేవాడిని.

జీవిత భాగస్వామిలో వుండాలని కోరుకునేవి
నాకంటే ఎక్కువగా నా వృత్తిని తను అర్థం చేసుకోగలగాలి. ఈ తరహా పనిలో షెడ్యూళ్లు స్థిరంగా వుండవు. పండగలకు సెలవులేం వుండవు. నిరంతరం ప్రయాణాలే. దానికి మించి... మా చుట్టూ సృష్టించే పుకార్లు మరో పెద్ద సమస్య. జయాపజయాలు అలా వచ్చి వెళుతుంటాయి. వీటన్నిటిని ఆమె తెలుసుకోగలగాలి.

ఔత్సాహిక నటులకిచ్చే సలహా
కష్టపడి పనిచేయాలి. ప్రతిభకు పట్టం కడతారని గుర్తుంచుకోవాలి. సినీ పరిశ్రమలో విజయం ఎప్పుడు తలుపు తడుతుందో ముందుగా ఊహించలేం. కొందరు ఏడాది రెండేళ్లంటూ గడువు పెట్టుకుంటూ వుంటారు. ఇక్కడ అలాంటివేం పనిచేయవు. ఒకవేళ ఇదే రంగంలో స్థిర పడాలనుకుంటే మాత్రం ఓర్పుతో వ్యవహరించాలి. ◆

నవ్వుల్ – పువ్వుల్

అరువు

జడ్జి: నువ్వు ప్రతిసారీ కోర్టుకు వచ్చి జరిమానా కట్టి వెళ్లిపోతున్నావు. ఈసారి పదివేలు జరిమానా కట్టు...!

దొంగ: ప్రతిసారీ క్యాష్ కట్టేస్తున్నా, ఈసారికి 'అరువు' రాసుకోండి...!

విజిల్స్ వేస్తేనే!



వీరేష్ : సెల్ ఆన్ చేసి, సినిమా మధ్యలో అలా విజిల్స్ వేస్తావేంరా...?

అవినాష్ : సినిమా బావుంటేనే, చూడటానికి వెళ్లమందిరా మా ఆవిడ అందుకే ఇలా చేస్తున్నా...!

దమ్ముందా!



గోపి : నీకు నిజంగా దమ్ముందా..?

రాజు : ఆ వుంది... ఏ పనయినా అవలీలగా చేయగలను...!

గోపి : అయితే ఉత్తరాన వున్న హిమాలయ పర్వతాలను, దక్షిణానికి కదుపు...!

తెలీక

లాయర్ : మొత్తం చీరల దుకాణాన్నంతా దొంగతనం చేసి దొరికిపోయావా, ఎందుకలా...?

దొంగ : మా ఆవిడకు ఏ చీర నచ్చుతుందో తెలీక...!

లోపలికి...

భర్త : నేను బయటికెళుతున్నా.. ఏమైనా కావాలా...?

భార్య : బయట చీరల మూటతో ఒకతను కూర్చుని ఉన్నాడు. అతన్ని లోపలికి రమ్మనండి....!

పందెం

రాము – జీవితంలో పందెం ఎప్పుడూ వేయకూడదురా...!

సోము – ఏం...?

రాము – నేనెప్పుడూ గెలవలేదు గనుక...!

వడ్డాణం



భార్య – నాకు వడ్డాణం చేయించండి...!

భర్త – అలాగే, మరి నీవు నీ నడుమును చిటికెన వేలంత సన్నగా మలచుకోవాలి...!

మాటల్లేవు

అంజి – మీ ఇంటికొచ్చి ఇంతసేపయింది... కనీసం టీ కూడా ఆఫర్ చేయట్లేదేంరా...?

కాశి – మా ఆవిడకూ నాకూ మాటల్లేవు...?

అంజి – ఎప్పట్నించి...!

కాశి – పది నిమిషాల నుంచి...!

లోన్

మేనేజర్ – నీకు అర్జంటుగా బ్యాంక్ లోన్ ఇవ్వాలా... దేనికి?

కస్టమర్ – ఈ బ్యాంక్‌ను కొనేద్దామని...

తగ్గించుకుంటారా!



భర్త : కూరలో ఉప్పు తక్కువయిందే...!

భార్య : డాక్టర్ గారు తగ్గించమన్నారు కదండీ...!

భర్త : ఆయన అలాగంటారు అంతేనే.. ఆయన ఫీజులో కొంత తగ్గిచమంటాం.. ఆయన తగ్గిస్తారా...!

యుద్ధం

సుబ్బారావు – మా ఇంట్లో యుద్ధం జరుగుతుందండీ... కంప్లయింట్ రాసుకోండి...!

పోలీస్ – ఏ యుద్ధం...?

సుబ్బారావు – నాకూ మా ఆవిడకూ మధ్య మాటల యుద్ధం...!

జిడ్డు

భార్య – తలకి షాంపూ పెట్టుకుని స్నానం చేయకండి...!

భర్త – ఏం...?

భార్య – మీ తలకున్న జిడ్డంతా షాంపూకి అంటుకుంటుంది..!

– ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

◆ స్ఫూర్తి

మూడు జంటల ముందడుగు

ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోంది. స్త్రీపురుష నిష్పత్తిలో అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వరకట్న సమస్య నానాటికీ క్లిష్టమౌతోంది. పిత్రుస్వామిక భావజాల ఆలోచనలు ఎక్కువౌతున్నాయి. 'అబ్బాయిలే కావాలి. ఆడపిల్లలు వద్దనే' ధోరణి పెరిగిపోతోంది. భ్రూణ హత్యలు... మిస్సవుతున్న ఆడపిల్లలు ..వీరిని వదిలించుకోవాలనే ధోరణి... ఎక్కడ చూసినా కనిపిస్తోంది. ఈ వాతావరణంలో మార్పు రాదా... ఎప్పటికైనా సాధ్యమేనా?! అన్న ప్రశ్నలకు సమాధానంగా కాకపోయినా... ఆశాకిరణంగా ... మూడు జంటలు ముందడుగు వేశాయి.

మెల్లగా మార్పు వస్తోంది. మరీ ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో. చదువుకున్న అమ్మాయిలు, అబ్బాయిలు ఇప్పటి వరకు వున్న 'గీత'లను దాటుకుని ముందడుగులు వేస్తున్నారు. కట్న కానుకలు, సంప్రదాయాలు, ఆర్భాటాలు, అంతస్థులు, కుల మతాల గిరులు తోసి రాజని జీవిత భాగస్వాములను ఎంచుకుంటున్నారు. అత్యంత సహజమైనగా భావిస్తున్న వరకట్నం... వంటి దురాచారాలపై నిశ్శబ్ద పోరాటం చేస్తున్నారు.

నిల్చిపోయే జ్ఞాపకం

గ్రాఫిక్ డిజైనర్ కేథలీన్ వర్గీస్ పెళ్లిలో ఇతర వివాహాల్లో కనిపించేవేవీ మచ్చుకు కూడా కానరాలేదు. కేథలీన్, వరుడు మాత్రమే వెళ్లి స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకున్నారు. వధూవరులు కాకుండా పెళ్లికి హాజరైన వారెవరైనా వున్నారూ అంటే అది ఆమె తల్లిదండ్రులే. వివాహానంతరం... ఇంటి దగ్గర ... మిత్రులకు ఒక చిన్న టీపార్టీ ఇచ్చారు. నిజానికి పెళ్లిలో సగం సందడి కాబోయే దంపతుల నేస్తాలదే. అంతటి ముఖ్యమైన మిత్రులకు మర్చిపోలేని జ్ఞాపకాలను అందించిందీ జంట. సహజంగా కొత్త జంటలు హనీమూన్‌కు వెళ్తుంటాయి. వీళ్ల మాత్రం నేస్తాలతో ట్రెకింగ్ ట్రిప్ పెట్టుకున్నారు.

ఇదంతా చదివాక... 'చుట్టాలు పక్కాలు హంగూ ఆర్భాటం లేకుండా పెళ్లేంటి?!' అనుకునే వారూ వుంటారు. "మన చుట్టూ జరుగుతున్న పెళ్లిళ్లలో అధికశాతం ఆడంబరాలకు పోయేవే. పెళ్లికి హాజరైన వధూవరులు మినహా హాజరైన ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతంగా వుంటుంది. ప్రయోజనమేముంది? మేం పాటించిన పద్ధతి మాకు చాలా సౌకర్యవంతంగా వుంది" అన్నది కాథరీన్ సమాధానం.

పెళ్లి కోసం ... డబ్బు, సమయం, వనరులను వృధా చేయడం ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. కేవలం ప్రేక్షకుల్లా కాక పెళ్లికి హాజరైన అతిథులందరూ పాల్గొనేలా ఆనందించేలా వుండాలనుకుందామె. ఆరోజున ఎవరు ఎంత ఖరీదైన చీరలు కట్టుకున్నారు? ఎంత విలువైన నగలు ధరించారు? అన్న విషయాలను కాకుండా... ఎవరెంత సరదాగా కబుర్లు చెప్పుకున్నారు? సంతోషంగా గడిపారన్నదే ప్రధానంగా వుండాలని ఆమె కోరుకుంది. "జీవిత భాగస్వామిగా ఎవరిని ఎంచుకుంటున్నాం? ఎలా పెళ్లి చేసుకోవాలి? అనేది పూర్తిగా వ్యక్తిగతం. నిన్ను నిజంగా ప్రేమించిన వాళ్లు నీ అభిప్రాయాన్ని తప్పక గౌరవిస్తారు. వరకట్నం అనేదే లేదు నా ప్రపంచంలో. నా పెళ్లికి ప్లాన్ చేసుకునేటప్పుడు దానికి చివరి ప్రాధాన్యత ఇచ్చాను" అంటోంది కాథలీన్ స్థిరంగా.

ఎలిజబెత్ చాందీ దంపతులు

పాప కోసం...

తిలక్-ధన చెన్నై వాసులు. ఇద్దరి వెనకా పెద్ద నేపథ్యం ఏం లేదు. డబ్బు అంతకన్నా లేదు. మనసు మాత్రం సువిశాలం. ఇద్దరికీ సమాజ సేవ చేయాలన్న తపన వుంది. అదే వారి స్నేహానికి...అనంతరం పెళ్లికి మార్గం వేసింది. ధనకు జంతువులన్నా, సమాజ సేవన్నా మహా ఇష్టం. తిలక్‌కు సంఘసేవ చేయాలంటే ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేసుంది. చెన్నై లోని ఎనిమిది హోమ్‌లలో వున్న అనాథ పిల్లల మంచీ చెడ్డకు కావాల్సిన నిధులను సేకరిస్తుంటాడు. ఆలోచనలు దగ్గరగా వుండడంతో వారిలో స్నేహం చిగురించింది. థెరిస్సా అనే నెలల పాపాయి రాక ధనను తిలక్‌కు మరింత దగ్గర చేసింది. ఎయిడ్స్ బాధితకు కలిగిన బిడ్డ థెరిస్సా. అయితే పాపకు ఆ జబ్బు సోకలేదు. పాపను ప్రేమగా చూసుకునే తల్లిదండ్రులకు దత్తత ఇవ్వాలని ఎంతగానో ప్రయత్నించింది ధన. కానీ నమ్మకం ఎవ్వరూ ఇవ్వలేకపోయారు. దాంతో తనే ఆ పని చేయాలనుకుంది. అందుకోసమే తిలక్‌తో పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. అతను కూడా సంతోషంగా ఒప్పుకోవడంతో... పెళ్లి చేసుకున్నారు.

వీరి వివాహంలో అన్నీ విశేషాలే. పెళ్లికి హాజరైన వారిలో ప్రముఖులు ఎవరనుకుంటున్నారు? ముందుగా ప్రస్తావించుకున్న ఎనిమిది హోమ్‌లలో పెరిగే చిన్నారులే (సన్నిహిత బంధువులు, మిత్రులు కాకుండా). పెళ్లికి హాజరయ్యేవారెవరూ గిఫ్టులు తేకూడదన్నది ప్రధాన నిబంధన. కాకపోతే 'థెరిస్సా ఎడ్యుకేషనల్ ఫండ్'కు మాత్రం విరాళాలు ఇవ్వవచ్చు. అదీ ఆసక్తి వుంటేనే. అన్నిటినీ మించి పెళ్లికూతురు ధన ఎప్పటిలాగే మామూలు బట్టలే వేసుకుంది మినహా పట్టుచేర కట్టుకోలేదు. విలువైన ఆభరణాలు అలంకరించు కోలేదు. చాలా సాదా సీదాగా బాగా దగ్గరివాళ్ల మధ్య పెళ్లి జరిగిపోయింది.

ధన తిలక్

మనసే ఒక ఆభరణం

పేరొందిన ఏ మళయాళ చానల్ చూసినా ప్రధానంగా రెండు ప్రకటనలు ఆకట్టుకుంటాయి. ఒకటి గొడుగులు. రెండు బంగారు ఆభరణాలు. మొదట్లో మళయాలీలు ఒక నెక్లెస్, చిన్న గొలుసు, మేచింగ్ జూకాలు వేసుకునేవారు. ఇప్పుడో! మెడ నుంచి మోకాళ్ల వరకు హారాలు...ముంజేతి నుంచి మోచేతి వరకు గాజులు తొడిగేస్తున్నారు. ఇక అమ్మాయికి ఒక బంగారు తొడుగు దిగేసినట్టే. చూద్దామన్నా పెళ్లికూతురు కనిపించదు. మరి ఇలాంటప్పుడు పుత్తడి ధర పెరగకుండా ఎలా వుంటుంది? బంగారం స్మగ్లింగ్ చేయడంకోసం వింత మార్గాలు ఎంచుకోకుండా ఎలా వుంటారు? ఇటీవల కేరళలో జరిగిన ఎలిజబెత్ చాందీ వివాహం ఆహుతులనే కాదు! పత్రికలనూ ఆకట్టుకుంది. కారణం కనిపెట్టడానికి కూసింత సమయం పడుతుంది. ఎందుకంటే ఈ మొత్తం ఎపిసోడ్‌లో సెంటర్ పాయింట్ అయిన పెళ్లికూతురి వల్లే ఇదంతా జరిగింది. మామూలుగానే పెళ్లికుమార్తెలకు వంటి నిండా బంగారం దిగేస్తారు. అలాంటిది పుత్తడిని ప్రాణంగా ప్రేమించే మళయాళీల సంగతి చెప్పేదేముంది?! వంటి నిండా నగలతో నింపేసి వుంటారు. అదే కారణమై వుంటుంది?! అనుకుంటే పొరబాటే. అసలు మతలబు అంతా ఇక్కడే వుంది. సంప్రదాయ దుస్తులను ధరించిన రోమన్ కాథలిక్ మళయాలీ పెళ్లి కూతురు ఎలిజబెత్ చాందీ బంగారు నగలను కాదని... కొబ్బరి చిప్పలతో చేసిన ఆభరణాలను అలంకరించుకోవడమే.

ఆమె గురించిన కథనం www.womensweb.in లో వచ్చినప్పుడు పదివేల లైక్‌లు నమోదయ్యాయి. లెక్కలేనన్ని ట్వీట్లు వచ్చాయి ఆమెను సమర్థిస్తూ. "తల్లిదండ్రులు ఏం సంపాదించి పెట్టారు? వారసత్వంగా ఎంత ఆస్తి లభించింది? అన్నదాన్ని యువతీయువకులు పట్టించుకోకపోవడం నిజమైన మార్పు. ఎవరికీ దేన్నీ ప్రదర్శించడం కోసం నేను పెళ్లి చేసుకోలేదు. ఎవరికీ భారం కాకుండా స్వేచ్ఛగా భాగస్వామిని ఎంచుకున్నాను' అంటోంది ఎలిజబెత్.

'కొబ్బరి నగల' ఐడియా ఎలా వచ్చింది తనకు? అంటే... ఎలిజబెత్ వాటిని ఓసారి అండమాన్‌లో చూసింది. అప్పుడే వాటిపట్ల మనసు పారేసుకుందేమో! తన పెళ్లికి వాటినే ధరించాలనుకుంది. త్రిస్సూర్‌లో ఆవిధమైన నగలను తయారుచేసే వ్యక్తిని కలిసింది. అతను చెప్పిన విషయాలను బట్టి బంగారు నగలకంటే కొబ్బరి నగలు ఆరోగ్యకరం అని తెలుసుకుంది. పైగా వీటికి మెరుగు పెట్టాల్సిన పని కూడా వుండదు. సహజసిద్ధమైన అందం వీటిది. అందుకే వాటి పట్ల మొగ్గుచూపింది. అంతేకానీ... ఎలిజబెత్ చాందీ బంగారు నగలకు వ్యతిరేకం కాదు. వాటిని ధరించిన వారి అందం ఇనుమడించాలి గానీ... మనిషిని కప్పేయకూడదన్నది ఆమె అభిప్రాయం. అందుకే సంప్రదాయ దుస్తుల్లో కొబ్బరి నగలతో పెళ్లికి హాజరైంది. మనసే ఒక ఆభరణమైనప్పుడు పై పై మెరుగులేల!

మూడు జంటల వివాహాల గురించి చదువుతుంటే... 'ఎవరో ఒకరు ఎపుడో అపుడు నడవరా ముందుగా అటో ఇటో ఎటో వైపు...' అన్న సినిమా పాట గుర్తు రాకుండా వుంటుందా?!

- సాహిల్

ఆ పది పల్లెలు

- కె. చరిత

మన దేశంలో పల్లెటూరు అంటే చాలు! ఏం గుర్తొస్తుంది? బురద, పేడ, చెత్త చెదారం... గుంటల మట్టి రోడ్లు, నిరక్షరాస్యత, పేదరికం, కనీస సౌకర్యాల లేమి, అంతకంతకు పెరిగిపోతున్న భ్రూణహత్యలు, ఊసే లేని ఇంటర్నెట్....! ఇలా ఎన్నయినా చెప్పకుంటూ పోవచ్చు. ఇందులో ఏమాత్రం అసత్యం లేదుగానీ... అన్ని గ్రామాలనూ ఒకే గాట కట్ట కూడదని మనవి. మన దేశంలోని ఓ పది పల్లెలు పట్టణాలకు దీటుగా ... ప్రపంచానికే మర్గదర్శకంగా నిలిచాయి. ఇక్కడ ఆడపిల్ల పుడితే పండుగే. బహిరంగ విసర్జనకు చెక్ పెట్టేసి, వంద శాతం అక్షరాస్యత సాధించారు. అరుదైన పక్షులతో దోస్తీ చేస్తూ, గుమ్మాలకు తలుపులు లేకుండా నిర్భయంగా జీవిస్తున్నారు. ఒకప్పడు క్షామంతో అల్లాడిన వారే సమిష్టి కృషితో కోట్లకు పడగలెత్తారు. సోలార్ వెలుగులతో, వైఫై కనెక్షన్లతో సాంకేతిక పరిజ్ఞానం తోడుగా ముందుకెళుతున్నారు. ఇలాంటి అద్భుత విజయాలతో పల్లవిస్తున్న పది పల్లెల విశేషాలు...

పక్షులతో దోస్తీ

కాకమ్మ, పిచ్చుకమ్మ... మీ ఇంటికి వచ్చి ఎన్ని రోజులైంది?! కిటికీ కమ్మీల మీద...వాకిట్లో మంచాల మీద వాలి కువకువల శబ్దం వినిపించి ఎన్నాళ్లైంది?! అలాంటిది ... కర్నాటకలోని ఓ గ్రామంలో ఎక్కడ చూసినా రకరకాల కొంగలు, అరుదైన పక్షులు... హాయిగా స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. మానవ ఆవాసాలకు అత్యంత సమీపంగా అవి గూళ్లు కట్టుకుంటాయంటే విస్మయం కలుగుతుంది. ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న ఆ గ్రామమే కోక్రెబల్లూర్. సెప్టెంబర్ వచ్చిందంటే చాలు! సుదూర తీరాల నుంచి పక్షులు ఇక్కడికి వచ్చి చేరతాయి. మే వరకు

వుండి... తమ సంతానాభివృద్ధి చేసుకుని ... పిల్లా జల్లాతో సంతోషంగా తిరిగి వెళ్తాయి. పొలాల్లో ఒక్కో చెట్టు మీద 20 జంటల వరకు పక్షులు గూళ్లు కట్టుకుంటాయి. ఇలాంటి చెట్ల కింద మాత్రం పంట వేయరు. అందుకోసం ప్రభుత్వం రైతులకు కొంత పరిహారం చెల్లిస్తుందనుకోండి. మే మాసంలో అక్కడ ఓ అరుదైన దృశ్యం కనిపిస్తుంది. పక్షి పిల్లలు ఎగరడం నేర్చుకుంటూ వుంటాయా సమయంలో. అవి చేసే విచిత్రమైన శబ్దాలతో గ్రామం మొత్తం సందడిగా వుంటుంది. జనవరి నుంచి మే మధ్య కాలం గ్రామ సందర్శనకు సరైన సమయం.

ఇళ్లకు తలుపులు లేవ్!

బయటికెళ్లాలంటే... తాళం వేసి... సరిగ్గా పడిందో లేదోనని ఒకటికి పదిసార్లు లాగి మరీ చూస్తుంటాం. అలాంటిది అసలు ఇళ్లకు తలుపులే లేకపోతే... ఎలా వుంటుంది? ఆ ఊహే రాదు కదా! మహారాష్ట్రలోని షాని షింగ్నపూర్ అనే గ్రామంలో ఏ ఇంటికి తలుపులే వుండవు. అలా వదిలేస్తారంతే. మరి దొంగల భయం వుండదా? అంటే... గత పదిహేను ఇరవయ్యేళ్లగా... స్థానిక పోలీస్ స్టేషన్లో... ఇంతవరకు ఒక్క నేరం కూడా నమోదు కాలేదంటే అస్సలు నమ్మం. సున్నా నేరాలంటే నోటెంట మాటే రాదు. తమాషా ఏంటంటే.. పబ్లిక్ టాయిలెట్లకు కూడా తలుపులుండవు. ఇళ్లకి మాత్రం కుక్కలు, పిల్లులు రాకుండా కర్టెన్లు వేస్తున్నారు అక్కడక్కడా. కొత్త కోడళ్లకు ఇదంతా విచిత్రంగా, అభద్రతగా అన్పించినా... తాము భయపడినట్టు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో... కొద్దిరోజులకు అలవాటు పడిపోతుంటారు. ఇళ్లు, కిరాణా కొట్లు, బట్టల కొట్లే కాదు. ఏ వ్యాపార సంస్థలకైనా అంతే. అందాకా ఎందుకు? ఆ మధ్య యుసిఒ బ్యాంకు అక్కడ తమ బ్రాంచీ ఏర్పాటు చేసింది. దానికి కూడా తలుపులు వద్దంటే వద్దన్నారు గ్రామస్తులు. డబ్బు, విలువైన పత్రాలు...ఏవీ ఎక్కడకూ పోవని గట్టిగా వాదించారు బ్యాంకు, పోలీసు అధికారులతో. అయితే సంఘ వ్యతిరేక శక్తులను రెచ్చగొట్టినట్టు వుంటుందని బ్యాంకు బైట మాత్రం పెద్ద గేటు ఒకటి అమర్చారు. కాకపోతే దానికి తాళం మాత్రం వుండదు. మొత్తం మూడు వందల ఇళ్లుంటే... ఒక్కదానికీ తలుపు వుండకపోవడం పెద్ద విశేషంగా మారింది. ఇప్పుడా గ్రామం గొప్ప సందర్శనీయ ప్రదేశంగా తయారైంది. ప్రతిరోజూ దేశం నలుమూలల నుంచి ఎందరో వచ్చి చూసి వెళుతుంటారు. దాంతో ఆటోలు, రిక్షాలు, కార్లు, హోటళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. శిల్పాషెట్టి, రాజ్‌కుంద్రా, లల్లూ ప్రసాద్ యాదవ్ లాంటి ప్రముఖులు సైతం గ్రామాన్ని సందర్శించిన వారిలో వున్నారు. గతంలో చెరకు సాగు చేసే గ్రామస్తులు టూరిజం మీదే బతికేస్తున్నారిప్పుడు. ఔరంగాబాద్‌కు 80 కిమీ దూరంలో వున్న ఈ గ్రామాన్ని చూడాలనుకునేవారికి అన్ని రకాల రవాణా సౌకర్యాలు అందుబాటులో వున్నాయి.

'శుభోదయం'తో చెంబుకు చెక్

గ్రామాల్లో...సూర్యోదయానికి ముందే కాలకృత్యాలు పూర్తి చేసుకోవాలి. మరి తెల్లగా తెల్లారాక చెంబులు తీసుకుని చెట్ల చాటుకు వెళ్లాలన్నా కష్టమే. అందుకే చలికి, వానకు వెరవక పొద్దున్నే పని కానిచ్చేస్తుంటారు. బహిరంగ విసర్జన సమస్య ఏ ఒక్క గ్రామానిదో కాదు. దేశ సమస్య. అయితే కర్నాటకలోని బెక్కినకెరి గ్రామస్తులు ఇందుకో పరిష్కారం కనిపెట్టారు. గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ రేఖ ఖోర్కార్ 'గుడ్ మార్నింగ్' బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఉదయాన్నే 5.30 గంటల నుంచి ఓ గంటసేపు... 'గుడ్ మార్నింగ్' చెప్తుంది. ఇదేదో బావుందే అనిపించినా ... వీళ్ల శుభోదయం చెప్పేది మరెవరికో కాదు! కాలకృత్యాలు తీర్చుకోవడానికి వచ్చే వారికి. ఇక చూస్కోండి! సిగ్గుతో తలలు వాల్చేసి...ఇంట్లో మరుగుదొడ్లు కట్టుకోడానికి డబ్బు లేదనో...మరోటో చెప్పి వడివడిగా వెళ్లిపోతుంటారట. అయితే బృందం వదిలిపెడితేగా! బహిరంగ కార్యక్రమం వల్ల ఆరోగ్యానికి ఎంత చేటో వివరిస్తారు. పైగా ఇళ్లల్లో మరుగుదొడ్లు కట్టించుకోడానికి పంచాయతీ సాయం చేస్తుందని కూడా భరోసా ఇస్తారు. దాంతో ఇప్పుడా గ్రామంలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. చూద్దామన్నా చెంబులు పట్టుకెళ్లేవారే కన్పించట్లా.

పాపాయి పుడితే స్వీట్లు

పురుషాధిక్యత భావజాలానికి పెట్టింది పేరు హర్యానా. అలాంటి రాష్ట్రంలోని ఒకానొక పల్లె చప్పర్. మేలి ముసుగు లేని మహిళలను ఊహించలేం. మగవాళ్ల ముందు నోరెత్తి మాట్లాడే చాన్సే లేదు. అలాంటి చోట... ఆడపిల్ల పుడితే! ఎలా వుంటుందో ఊహించవచ్చు. అయితే అది ఒకప్పటి మాట. ఇప్పుడు సంతోషంతో స్వీట్లు పంచుకుంటున్నారు. అంతేకాదు! ఆడపిల్లలను బడికి పంపిస్తున్నారు. మహిళలు ముసుగులు వేసుకోవడం మానివేశారు. ఇదంతా ఎలా సాధ్యం? అంటే... గ్రామ సర్పంచ్ నీలమ్ కృషి వల్లనే. భర్త, అత్తమామల సహకారంతోనే ఇదంతా సాధించగలిగింది. మొదట ఆడవాళ్ల హక్కుల గురించి ప్రచారం ప్రారంభించింది. వరకట్నం ఎందరి జీవితాలను ఎలా బలితీసుకుందో చెప్పింది. ఆడ శిశువుల భ్రూణహత్యల కారణంగా జనాభా నిష్పత్తిలో వస్తున్న మార్పులను... వాటి పర్యవసానాలను కళ్లకు కట్టినట్టు తెలియచేసింది. దాంతో మెల్లగా గ్రామంలో మార్పు వచ్చింది. ఇవాళ రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 877 మంది మహిళలుండగా... చప్పర్‌లో మాత్రం పాపాయి పుడితే పండుగ చేసుకుంటున్నారు.

పరిశుభ్రతకే పట్టం

మాలీనాగ్! మేఘాలయ రాజధాని నగరానికి 90 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. ఏ సమయంలో అడుగెట్టినా అద్దంలా మెరిసిపోతూ ఇరుగుపొరుగు గ్రామాలవారి అసూయకు కారణమౌతుంది. ఆసియా ఖండంలోకెల్లా పరిశుభ్రమైన గ్రామంగా ప్రపంచ ప్రసిద్ధమైంది. ఇక్కడ మొత్తం వందకుపైగా ఇళ్లున్నాయి. వంద శాతం అక్షరాశ్యత వుంది. అందరూ చదవగలరు, రాయగలరు. పైగా ఆంగ్లంలో మాట్లాడతారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి వుంటుంది. వీధి చివరన కూడా పబ్లిక్ మరుగుదొడ్లు వుంటాయి. వాటిని అందరూ ఉపయోగిస్తారు. ఎక్కడా బహిరంగ విసర్జన అనేదే కనిపించదు. ఉదయాన్నే ఐదు గంటల నుంచే గ్రామాన్ని శుభ్రం చేయడానికి సిద్ధమౌతారు స్థానికులు. గ్రామ సభ అందుకోసం కొందరు ఉద్యోగులను తీసుకున్నప్పటికీ రోజంతా ఆ పని నిరాఘాటంగా నడవాలంటే ఎక్కువ మందిని పనిలోకి తీసుకోవాల్సి వుంటుంది. అందుకు ఖర్చు కూడా చాలా అవుతుంది. అందుకే గ్రామస్తులే స్వచ్ఛందంగా అందుకు పూనుకుంటారు. చెట్ల నుంచి రాలిన ఆకులను, ఎండు కొమ్మలను ఎత్తివేయడం, ఊడ్చడంలో గ్రామస్తులు నిరంతరం బిజీగా వుంటారు. పిల్లలకు కూడా బాల్యం నుంచీ పరిశుభ్రతను బోధిస్తారు. పాఠశాల దశలోనే జరిగిపోతుంది. ఒకవేళ రోడ్లమీద ఏదైనా అసహ్యకరమైన పదార్థం కనిపించినా ... ఏమాత్రం భేషజాలకు పోకుండా ... దాన్ని చెత్తబుట్టలో వేసేస్తుంటారు. చెట్లకు కాచిన కాయలు, పళ్లు, పూలు... గ్రామస్తులు తమ కుటుంబ అవసరాల కోసం తీసుకోవచ్చు. అయితే వాటిని వ్యాపార నిమిత్తం వాడకూడదు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించినా, వీధుల్లో చెత్త పడవేసినా ఒక డాలరు జరిమానా కట్టాల్సి వుంటుంది. పరిశుభ్రత పాటించడం, నియమాల ఉల్లంఘనకు సంబంధించిన పరిశీలనపై నిఘా పటిష్టంగానే వుంటుంది. గ్రామసభ క్రమశిక్షణ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రతి ఇంట్లోనూ శుభ్రంగా వుందా లేదా అనేది నిరంతరం పర్యవేక్షిస్తారు. పైగా స్థానికంగా నివసించే ఖాశి తెగ ప్రజలు ప్రకృతి ఆరాధకులు. అడవిని, వృక్షాలను కాపాడుకునేందుకు వీరు నిరంతరం శ్రమిస్తారు.

సోలార్ వెలుగుల్

ధర్నాయ్! బీహార్‌లోని ఓ సాదాసీదా గ్రామం. జెహానాబాద్ జిల్లాలో వుంది. వ్యవసాయం ప్రధాన వృత్తి. పూర్తిగా సోలార్ విద్యుత్‌తో నడుస్తున్న తొలి గ్రామం అదే. 4,500 మంది గ్రామస్తుల జీవితాల్లో ఇప్పుడు వెలుగులు నిండాయి. వీధుల్లోను, ఇళ్లల్లోను పండువెన్నెల్లా పరుచుకున్న సోలార్ కాంతులను మనసారా ఆహ్వానం పలుకుతూ ఆస్వాదిస్తున్నారు. చిన్నారులు తృప్తిగా అలసిపోయే వరకు ఆడుకుంటున్నారు. చీకటి పడ్డాక ఇళ్లకొచ్చి చదువుకుంటున్నారు.

మహిళలు సైతం ఎవరో తరిమినట్టు కాకుండా ప్రశాంతంగా ఇంటి, వంట పనులు చేసుకుంటున్నారు. కిరాణా కొట్టులు సైతం రాత్రిళ్ల పొద్దుపోయే వరకు తెరిచే వుంటున్నాయి. మొత్తం మీద గ్రామంలో పని గంటలు పెరిగి...ఆదాయం కూడా వృద్ధి చెందింది. ఈ మార్పుకు కారణం గ్రీన్ పీస్ అనే స్వచ్ఛంద సంస్థ. మొత్తం గ్రామ అవసరాలను, పరిస్థితులను అధ్యయనం చేసి ... 100 కిలోవాట్ల సోలార్ మైక్రో గ్రిడ్‌ను ఏర్పాటు చేసింది. మొట్ట మొదట గ్రామంలోని వీధి దీపాలు వెలిగించింది. అనంతరం ఇళ్లకు సోలార్ విద్యుత్ అందించింది. జులై నాటికి పూర్తిగా సోలార్ వెలుగులు పరుచుకున్నాయి గ్రామంలో. ప్రస్తుతానికి అక్కడి రెండు పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, కిసాన్ శిక్షణా కేంద్రం, చిన్న చిన్న వ్యాపార కేంద్రాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం వుంది. పాఠశాలల్లోను, ఇళ్లల్లోను విద్యుత్ వుండడంతో విద్యార్థులకు చదువుకునే సౌకర్యాలు, అవకాశాలు పెరిగాయి. చీకట్లో పుగుపుట్రకు భయపడుతూ...ప్రమాదాలకు గురవుతూ... వంట చేయాల్సిన పరిస్థితి మహిళలకు తప్పింది. గ్రిడ్ నిర్వహణ పనుల్లో గ్రామస్థులే పాలు పంచుకోవడంతో...వారికి ఉపాధి కూడా అందుతోంది. పైగా సోలార్ విద్యుత్ సాయంతో నడిచే నీటి పంపులు కూడా అందుబాటులోకి రావడంతో తాగు, వాడుక నీటికోసం సుదూర ప్రాంతాలకు కాలినడకన పోవాల్సిన పరిస్థితి మారిపోయింది.

వంద శాతం అక్షరాస్యత

ఈ మాట వినగానే గుర్తొచ్చేది కేరళ రాష్ట్రం. అక్కడి పోతనిక్కడ్ గ్రామం నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిన తొలి భారతీయ గ్రామంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతానికి ఈ చిన్ని పల్లె విద్యావంతులకు నిలయంగా పేరొందింది. ఇక్కడి సెయింట్ మేరీస్ హై స్కూల్ గ్రామంలోకెల్లా అత్యంత పురాతన పాఠశాల. ఎందరో ప్రముఖులు, రాజకీయ నాయకులు ఈ గ్రామం నుంచే తయారయ్యారు. ఇదే కాక ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు మరికొన్ని వున్నాయి. సిబిఎస్ఇ పాఠ్యాంశాలు బోధించే సౌకర్యం కూడా వుంది.

కోటీశ్వరుల గ్రామం

ముంబైకి 30 కిమీ దూరానున్న హివారే బజార్ గ్రామానికి చీకటి వెలుగులు రెండూ తెలుసు. ఒకప్పుడు కరువుతో కటకటలాడిన ఆ గ్రామంలో ఇవాళ 60 మంది కోటీశ్వరులున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. ఐకమత్యంతో అభివృద్ధి సాధించారు. గ్రామంలో కాలువలు, బావులు ఎక్కడ తవ్వాలి, నీటి నిల్వలను ఎలా పెంచాలి? నీటిని గ్రామస్తులంతా ఎలా ఉపయోగించుకోవాలి? ఏ పంటలు సాగుచేయాలి? వంటి అన్ని కీలకమైన నిర్ణయాలు చేయడంలోను, వాటిని అమలులోనూ గ్రామస్తులందరి భాగస్వామ్యం వుంది. హివారే బజార్లో శ్వేత విప్లవమే వచ్చిందనుకోవాలి. 1995లో 150 లీటర్ల ఉత్పత్తి మాత్రమే జరిగే చోట ఇవాళ 4 వేల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. పంట దిగుబడి పెరిగింది. పశుగ్రామంలో పాల ఉత్పత్తి పెరిగింది. అంగన్‌వాడీ, ప్రాథమిక, విద్య, ఆరోగ్యం తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, రోడ్ల నిర్మాణం... వంటి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టారు. వ్యక్తుల ప్రయోజనాలకంటే మంది ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత నిచ్చారు. ప్రస్తుతం గ్రామంలో మూడంటే మూడే కుటుంబాలు దారిద్ర రేఖకు దిగువన వున్నాయి. 20 ఏళ్లలో సగటు ఆదాయం 20 రెట్లు పెరిగింది. 60 మంది కోటీశ్వరులున్నారు. 1995లో 168 మంది బిపిఎల్ కింద వుంటే ఇవాళ కేవలం 3 కుటుంబాలు మాత్రమే వున్నాయి. గ్రామస్తులు పాల సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారం వేసిన రోడ్లు, సిమెంటుతో కట్టిన ఇళ్లు ...దర్శనమిస్తాయి. ప్రతి ఇంటికి ఒక మరుగుదొడ్డి వుంటుంది. దేశవ్యాప్తంగానే స్త్రీపురుష నిష్పత్తి బాగా పడిపోయిన తరుణంలో ఈ గ్రామం ఆడపిల్లలకు ఎక్కడలేని ప్రాధాన్యత ఇస్తోంది. వంద శాతం అక్షరాస్యత సాధించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి హివారే బజార్ గ్రామం అనేక అవార్డులను అందుకుంది. గ్రామాభివృద్ధిని కళ్లారా చూడస్దానికి ప్రతిరోజూ దూరతీరాల నుంచి సందర్శకులు వచ్చిపోతూనే వుంటారు.

పది రూపాయలకే వైఫై

సిటీల్లో సైతం... దుర్ఘటన జరిగితే... సిసి కెమెరాలు లేక... నేరస్థులను పట్టుకోవడం కష్టమైన సందర్భాలెన్నో. అలాంటిది ఓ మారుమూల పల్లెటూళ్లో వైఫై, సీసీ కెమెరాలు, సోలార్ ప్యానళ్లూ... వున్నాయంటే విస్మయం కలుగుతుంది. ప్రతి రోజూ పొద్దున్నే మినరల్ వాటర్ బాటిళ్ల వ్యాన్ వస్తుంది. లీటరు నాలుగు రూపాయలు. నెలకు పది రూపాయలు చెల్లిస్తే చాలు వైఫై సౌకర్యం అందుతుంది. ఊళ్లోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లోను ఏసీ వుంది. గ్రామం మొత్తం మీద ముఖ్యమైన పాతిక కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. స్కూళ్లలో ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు బోధిస్తున్న విధానం కూడా చూడొచ్చు గ్రామస్తులు. మినరల్ వాటర్ ప్లాంట్ కూడా నిర్వహించుకుంటున్నారు. ఇన్ని సౌకర్యాలున్న గ్రామం గుజరాత్‌లోని పున్సరి గ్రామం. 2006లో గ్రామ సర్పంచిగా ఎన్నికైనప్పుడు హిమాంశు పటేల్ వయసు కేవలం ఇరవై నాలుగు సంవత్సరాలే. అప్పట్లో ఇవేవీ లేవక్కడ. పైగా కొందరు గ్రామస్తులు తమ చిన్నారులను పొరుగూళ్లలో చదివించుకునేవారు. ఎలాంటి తరతమ బేధాలు లేకుండా గౌరవ ప్రదంగా జీవించడానికి కావాల్సిన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయాలనుకున్నాడా యువ సర్పంచ్. ఏం చేయాలన్నా నిధులుండాలి. అందుకోసం పంచాయతీ భూములు కొంత అమ్మగా వచ్చిన సొమ్ము, కేంద్ర రాష్ట్ర ప్రభుత పథకాల నుంచి వచ్చే నిధులతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది పున్సరి పంచాయతీ. ఈ కార్యాలయం చూసినవారెవరికైనా సరే... కార్పొరేట్ ఆఫీసు స్ఫురణకు వచ్చేస్తుంది. మరి ఫ్యాక్సు మిషన్, ప్రింటర్, కంప్యూటర్, ఏసీ...అన్నీ వుంటాయి. రైతులు చిరుధాన్యాల సిరులు పండిస్తున్నారు. అంతేనా! ఈ గ్రామం పేర ఫేస్‌బుక్ అకౌంట్ కూడా వుంది. గూగుల్‌లో 'నెంబర్ 1 గ్రామం పున్సరి' అని వెతికితే.... పూర్తి సమాచారం మన ముందుంటుంది.

'ఆర్సెనిక్' ఆట కట్టించారు

జలమే జీవాధారం. అంతటి ప్రాణాధారమైన నీళ్లలో ఏమాత్రం తేడా వున్నా... ముందు తరాలూ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. 'ఆర్సెనిక్' (పాషాణం) రూపంలో అలాంటి సమస్యే ఎదురైంది ఉత్తర ప్రదేశ్ లోని 'బల్లియ' గ్రామస్తులకు. నీటిలో, ఆక్సిజన్‌తో కలవనంత వరకు ఆర్సెనిక్ వల్ల ప్రమాదం లేదు. పొరపాటున విలీనమయ్యిందో... విషతుల్యంగా మారిపోతాయి. ఆ రాష్ట్రంలోని పలు గ్రామాల్లో బావి నీటినే వాడేవారు. పాతికేళ్ల కిందట ప్రభుత్వం

కలుగ చేసుకొని చేతి పంపులు వేసింది. దాంతో బావులను విడిచిపెట్టి చేతి పంపులనే ఆశ్రయించారు. అప్పుడు అసలు సమస్య మొదలైంది. 38 శాతం పంపుల్లోని నీటిలో ఆర్సెనిక్ అధికంగా వుందని వెల్లడైంది. పైగా గ్రామస్తులకు మొండి చర్మ వ్యాధులు పట్టి పీడించసాగాయి. గ్రామస్తులే ఒక పరిష్కారం కనిపెట్టారు. పన్నెండు మంది కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. వీరికి తొంభై అయిదేళ్ల ధనిక్ రామ్ వర్మ నాయకుడు. తాడు ద్వారా ఒకరు బావిలోకి దిగి శుభ్రం చేసి చెత్తా చెదారం వుంటే పైకి లాగేస్తారు. అలా పునరుద్ధరించిన బావి నీటిని వాడుతూ ఆర్సెనిక్ సమస్య నుంచి బయట పడ్డారు. చివరికి 'ఆల్ ఈజ్ వెల్' అన్నమాట. ◆

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -14)

అప్పటికే అడుగు తీసి అడుగు వెయ్యలేనంతగా కిక్కిరిసిన లండన్ మురికివాడల్లోకి ఐర్లండ్‌లోని క్షామంతో మరి కొన్ని వేలమంది వచ్చి చేరారు. అయితే కొత్తగా వచ్చినవాళ్లకు మనుషుల ఆనవాళ్లు లేవు. లండన్ సందుల్లో ఎక్కడ పడితే అక్కడ కూర్చున్న వృద్ధ మహిళలు చెత్త బస్తాల్లా కనిపించారు. వాళ్ళు పీలుస్తున్న పైపుల్లో నుంచి వచ్చిన పొగ వల్ల మాత్రమే అక్కడెవరో మనుషులున్నారని పోల్చుకోగలం. చింకిపాతల్లో వున్న పిల్లలు ఒళ్లంతా కప్పుకొన్న మురికితో ఆడో, మగో కూడా తెలియలేదు. ఇక వయసెంతో చెప్పటం అసంభవం. మరికొందరు ఒంటి రంగు పూర్తిగా మారిపోయింది. అప్పటికే అక్కడ వుంటున్న ఐరిష్ వాళ్లు కొత్త వాళ్లను రానివ్వలేదు. అసలే కూలీ డబ్బులు సరిపోవటం లేదంటే వీళ్లు మరింత తక్కువకు పని చేస్తామంటున్నారు. పైగా కాలు మోపటానికి స్థలం లేని చోట వీళ్లెలా వుంటారు?

మాంచెస్టర్‌లో మురికివాడలు నది పొడవునా వెలిశాయి. కాని లండన్‌లో స్థలాభావంతో నిట్టనిలువుగా లేచాయి. ఈ నాలుగంతస్తుల కట్టడాల్లో, సెల్లార్ నుండి డాబా మీది గది దాకా ఆక్రమించారు జనం. ఒక్క అంగుళం కూడా వదల్లేదు. చివరికి మెట్లు కూడా. కొందరు మొత్తం బెడ్ అద్దెకు తీసుకోవటానికి డబ్బు లేక, తాము పడుకోగలిగినంత స్థలం మాత్రమే కావాలన్నారు. మరి కొందరు గోడకు వేలాడదీసిన తాడును అద్దెకు తీసుకున్నారు.

“ జెన్నీకి తల్లంటే ప్రాణం. ఆమెను ఒంటరిగా వదలటం ఎలా అని బాధపడింది. కోపంతో, సమాజంలో మహిళల దైన్య స్థితిని వివరిస్తూ కార్ల్ మార్క్స్‌కో లేఖ రాసింది. అందులో ఆమె తన భర్త రాడికల్ అయిడియాలజీని కూడా వ్యతిరేకిస్తూ స్త్రీలను సమర్థించింది. ఈ రాడికల్ బృందాల్లో ఎప్పుడూ హక్కుల గురించిన చర్చలు కొనసాగుతుంటాయి. కాని అవన్నీ కేవలం పురుషుల హక్కుల గురించి మాత్రమే ‘స్త్రీల హక్కుల గురించి తర్వాత మాట్లాడదాంలే’ అంటారు. ”

అవి పట్టుకొని, కూర్చుని నిద్ర పోవచ్చు. సంపన్నులకు నిత్యానుభవమైన వెచ్చటి పడకకోసం వెదుకుతూ ఆడా, మగా, పిల్లా, పెద్దా నగరమంతా తిరిగారు. శరణార్థుల సంఖ్య పెరిగి, ‘కూలీ ఎంత?’ అని కాక, కూలీ దొరికితే చాలనుకొనే దశకు దిగజారటంతో లండన్ పరిస్థితి, మాంచెస్టర్ కన్నా అధ్వాన్నంగా తయారైంది. అక్కడి సోహో స్క్వేర్, సెయింట్ గైల్స్, స్ట్రాండ్‌లలోని సెక్స్ వ్యాపారం ఎంత నికృష్టంగా వుందో ఊహించుకోవాల్సిందే. ఎవరైనా డబ్బులు విదిలించకపోతారా అనే ఆశతో పాలబుగ్గల పసి పిల్లలు పచ్చిబూతులు మాట్లాడుతూ కష్టమర్లను ఆకర్షించటానికి ప్రయత్నించారు. గ్రామాల నుండి నిర్వాసితులై వచ్చిన పిల్లలు వీధుల్లో బతకగలిగే కళను త్వరగా అభ్యసించారు. పొట్ట చేత పట్టుకున్న కార్మికులు, ఆకలికి తాళలేని వాళ్లు ఏ పని చెయ్యటానికైనా వెనుకాడరు. ‘జీవించే విద్య’ అంటే అదే. ‘అమ్మటానికి నీ దగ్గిరేముంది?’ అని సమాజం అడిగింది. మాంచెస్టర్‌లోని కార్మికుల్లాగానే వీళ్లూ తమ శరీరాలను అమ్మకానికి పెట్టారు.

మూలం : మేరీ గేబ్రియెల్ ‘లవ్ అండ్ కేపిటల్’

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

ఇద్దరు మిత్రులూ (మార్క్స్, ఎంగెల్స్) నగరమంతా తిరిగి పేదలకు వీలైనంత సాయం చేస్తున్న జర్మన్‌లనూ, ఇంగ్లీష్ వాళ్లనూ కలిశారు. ఇందులో కొందరు ‘లీగ్ ఆఫ్ ది జస్ట్’ సభ్యులు (మార్క్స్‌కు వీళ్లతో పరిచయముంది). ఇక్కడ జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ పేరుతో పని చేస్తున్నారు. కార్ల్ షాపర్, హైన్రిష్ బార్, జోసెఫ్ మాల్ వీళ్ల నాయకులు. "నాకు తెలిసిన తొలి విప్లవ కార్మికులు వీళ్లే. నా మీద చెరగని ముద్ర వేశారు" అన్నాడు ఎంగెల్స్.

నిజానికి లీగ్, విద్యా సంస్థను ప్రారంభించింది, సభ్యులను చేర్చుకోవటానికే. దీనికి స్విట్జర్లాండ్, జర్మనీలలో శాఖలున్నాయి. ప్రభుత్వాలకు విద్యా సంస్థల మీద అనుమానం వచ్చినప్పుడు స్పోర్ట్స్ క్లబ్బుల్లాంటివి ప్రారంభించి తమ కార్యకలాపాలు కొనసాగించారు. ఎలాగైనా, కొత్త వాళ్లను ఆకర్షించి రహస్య సంస్థ అయిన ‘లీగ్’లో చేర్చుకోవటం ముఖ్యం. ఇప్పుడిందులో, జర్మన్‌లే కాక ఇతర దేశాల వాళ్ల సంఖ్య కూడా పెరగటంతో ‘కమ్యూనిస్ట్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్’గా పేరు మార్చారు.

ఇరవై భాషల్లో ముద్రింపబడిన సభ్యత్వం కార్డుల మీద మానవులంతా సోదరులే – ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్ అని రాశారు. అయితే, ఎంగెల్స్ మాటల్లో "ఇందులో ఎక్కువగా వృత్తి నిపుణులే సభ్యులుగా వున్నారు. వృత్తి నిపుణులంటే కార్మికులలోని సంపన్న వర్గం. ఎక్కువ మందికి యజమానులు కావాలని కోరిక వుంది."

ఇంగ్లీష్ రాడికల్ ఉద్యమంలో మొదటి నుండీ కార్మికులూ, వృత్తి నిపుణులూ కలిసే వున్నారు. 1792లోనే థామస్ హార్డీ అనబడే బూట్ల తయారీదారు ఓటింగ్ హక్కుల కోసం లండన్ కరస్పాండింగ్ సొసైటీ స్థాపించాడు. ఈ చర్యను దేశ ద్రోహంగా పరిగణించి, సజీవంగా పొట్ట కోసి, తర్వాత ఆయన్ను ఉరితీశారు. అధికారులు, ఇతర దేశాల కన్నా ముందరే ఇంగ్లండు పారిశ్రామికీకరణ చెందింది గనక (కొత్త పారిశ్రామిక) వ్యవస్థ అధ్యయనానికి ఇదే అనువైన చోటు. 1820లో తొలి బ్రిటిష్ సోషలిస్ట్ అయిన రాబర్ట్ ఓవెన్ 'కార్మికుల వద్ద శ్రమ అనబడే డబ్బుంది కాని ఆ డబ్బులకు విలువ లేదు' అన్నాడు. ఫ్యాక్టరీ యజమానులు, ఉత్పత్తిదారులే ఈ దోపిడీ వ్యవస్థకు కారణమన్నారు రాడికల్స్. వీళ్లందరూ ముందున్న ధనిక భూస్వాములు, బడా వ్యాపారస్తులు కూడా కార్మికుల దుస్థితికి కారణమే. నిజానికి ఇప్పుడు ఆవిర్భవిస్తున్న పరిశ్రమలకు ఆర్థిక సహాయం చేస్తున్నది వీళ్లే.

1830లో మాంచెస్టర్‌లోని కార్మికులు, పురుషులందరికీ ఓటు హక్కు కావాలనే డిమాండ్‌తో ఒక యూనియన్ పెట్టుకోవటానికి ప్రయత్నించారు. కాని ప్రభుత్వం నిరాకరించింది. కార్మికులు తమను తాము ఒక వర్గంగా గుర్తించుకున్నారు. వాళ్ల "కార్మిక వర్గం" అంటే వర్కింగ్ క్లాస్. అల్ప సంఖ్యాకులు చేసిన చట్టాల వల్లనే ఇన్ని సమస్యలొస్తున్నాయి. అధిక సంఖ్యాకులు చట్టాలు చేయటమే దీనికి పరిష్కారం" అన్నారు.

1837లో బ్రిటిష్ కార్మికోద్యమ నాయకులు పార్లమెంట్ – హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఆరు డిమాండ్లతో ఒక అర్జీ పెట్టుకున్నారు. ఇదే పీపుల్స్ చార్టర్. రాజకీయ సంస్కరణలు, బ్రిటిష్ పౌరులందరికీ పార్లమెంట్‌కు పోటీ చెయ్యగలిగే హక్కు కల్పించటం వీళ్ల ముఖ్య డిమాండ్లు. కాని వీళ్లనెవరూ పట్టించుకోలేదు. 1845లో చార్టిస్టులు, ఫ్రాన్సు, జర్మనీలలో వున్న కార్మికులను కూడా కూడగట్టుకోవటానికి ప్రయత్నించారు (ఉద్యమం కొనసాగాలంటే విస్తృతమైన సహకారం తప్పదు).

బకూనిన్

రాబర్ట్ ఓవెన్

" ప్రసవానికి ముందర ఈ హడావిడి కార్ల్ పనికి అడ్డు తగులుతుందేమోనని భయపడింది జెన్నీ. భర్తను మధ్య అంతస్తులో పని చేసుకొమ్మని, మొదట చంటిపిల్లతో పైఅంతస్తులోనూ ఆ తర్వాత కింది అంతస్తుకూ వచ్చింది (కార్ల్ రాస్తున్న పుస్తకం పేరు అప్పటికి సింపుల్‌గా 'పొలిటికల్ ఎకానమీ'). అప్పటికే ఆ పుస్తకం గురించి చర్చ జరుగుతున్నది. రాజకీయంగా ఇది ఎంతో ప్రభావం చూపే అవకాశముంది. అంతకన్నా ముఖ్యంగా తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడొచ్చు. పుస్తకాలు తప్ప వాళ్లకు వేరే ఆదాయం లేదు. మిత్రులు వీలైనంత సాయం చెయ్యటం లేదని కాదు. కాని ఎన్నాళ్లిలా పరుల దాతృత్వం మీద ఆధారపడి బతకటం? "

ఈ నేపథ్యంలో 'ఇద్దరు మిత్రులు' ఇంగ్లీష్ కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. చార్టిజం, సోషలిజం, కమ్యూనిజం వగైరా అన్నీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేస్తున్న చారిత్రక పోరాటాలకు మారు పేర్లే అన్న విషయం స్పష్టమైంది.

కార్మిక నాయకుల అనుభవాల నుండి చాలా నేర్చుకున్న మార్క్స్, ఎంగెల్స్ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయటానికి మార్గాలను అన్వేషిస్తూ బ్రసెల్స్ చేరుకున్నారు.

పైకి ఎంత కఠినంగా కనిపించినా సాటి మనుషుల పట్ల మార్క్స్‌కున్న సహానుభూతి గొప్పది. అతణ్ణి విమర్శించే వాళ్లు తరచూ ఈ విషయం విస్మరిస్తారు. 'మార్క్స్‌లో ప్రేమకన్నా ద్వేషం ఎక్కువ' అన్నారు కొందరు సమకాలికులు. కాని ఆయన జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే రెండూ సమ పాళ్లల్లో ఉన్నాయని అర్థమవుతుంది. ఇంగ్లండులో చూసిన మనుషుల్ని పరిస్థితుల్ని బట్టే ఈ రెండు భావనలూ అతనిలో కలిగాయి. ఏది ఏమైనా తిరిగి బ్రసెల్స్‌కు చేరే నాటికి మార్క్స్‌లో మార్పొచ్చింది. 'ఇప్పటి వరకు తాను చదివిన పుస్తకాలు, తాను మాట్లాడిన మాటల వెనుక నిజమైన మనుషులున్నారు' అన్న సత్యం అనుభవంలోకి వచ్చింది.

మాంచెస్టర్ ప్రయాణం వల్ల కలిగిన మరో లాభం – మార్క్స్, ఎంగెల్స్‌ల స్నేహం దృఢపడింది. అంతకుముందు పది రోజులు వాళ్లు పారిస్‌లో గడిపారు. కాని ఆ తర్వాత కేవలం లేఖల ద్వారానే మాట్లాడుకున్నారు. సమావేశాల్లో, గ్రూపుల్లో మాత్రమే అప్పుడప్పుడు కలిశారు. మాంచెస్టర్ ప్రయాణంలో ఇద్దరిలోనూ మేధోపరంగానే కాదు, వ్యక్తిగతంగా అన్ని అభిరుచుల్లో సారూప్యం కనిపించింది. ఇన్నాళ్లూ వయసులో అనేక సంవత్సరాలు తన సీనియర్లయిన వాళ్లతో మాత్రమే (హెర్విగ్, బకూనిన్ తప్ప) పని చేశారు మార్క్స్. ఇద్దరి మేధోపటిమ అసామాన్యం. ఇద్దరికీ అసహనం కూడా ఎక్కువే. వ్యక్తిగత జీవితంలో మర్యాదలు, సంప్రదాయాలు పాటించరు. ఎవరేమనుకున్నా పట్టించుకోరు. మాటలు అంత మర్యాదపూర్వకంగా ఉండవు. ఇద్దరికీ పొగాకు అంటే ఇష్టం (ఎంగెల్స్ పైప్ కాలుస్తాడు. మార్క్స్‌కు సిగార్ ఇష్టం. రాత్రంతా కూర్చుని తాగగలరు. (ఎంగెల్స్‌కు వైన్, ఏల్ ఇష్టం. మార్క్స్‌కు ఏదుంటే అదే). ఇద్దరూ కబుర్లరాయుళ్లే. బిగ్గరగా నవ్వుతారు. (ముఖ్యంగా తమ శత్రువులను గాయపర్చటానికి ఇక మార్క్స్ అయితే కన్నీళ్లు కారే దాకా నవ్వాపడు.)

000

బ్రసెల్స్, 1846

మనిషి ఏ పని చెయ్యాలన్నా, అన్నింటికన్నా ముందర ఆహారం, నీళ్లు, గృహ వసతి, దుస్తుల అవసరాలు తీరాలి. అంటే మనిషి తన భౌతిక అవసరాలు తీర్చుకోవటానికి ఉత్పత్తి చేశాడన్నది మొదటి చారిత్రక సత్యం. భౌతిక జీవన విధానమే ఇతర అన్ని రంగాలలోని కార్యాచరణనూ శాసిస్తున్నది

– కార్ల్‌మార్క్స్

సెప్టెంబర్ చివరలో జెన్నీ 'ముష్టివాళ్ల కాలనీ' అని తను పేరు పెట్టిన ఇంటికి తిరిగి వచ్చింది. ప్రసవం దగ్గిర పడింది. తల్లిని ఒంటరిగా వదలటం ఇష్టం లేక, తన తిరుగు ప్రయాణాన్ని కొన్నాళ్లు వాయిదా వేసుకోవటం వల్ల ఆలస్యమైంది. మొదట బ్రసెల్స్ వెళ్లి, అక్కడి నుండి వ్యాపారంలో తన అదృష్టం పరీక్షించుకోవటానికి

అమెరికా వెళతానన్నాడు ఎడ్గార్. ఇప్పుడు తన తల్లికి అరవై ఏళ్లు. ఆర్థికంగా చితికిపోయింది. ఒకప్పటి అరిస్టోక్రాట్ దిక్కులేనిదైంది.

జెన్నీకి తల్లంటే ప్రాణం. ఆమెను ఒంటరిగా వదలటం ఎలా అని బాధపడింది. కోపంతో, సమాజంలో మహిళల దైన్య స్థితిని వివరిస్తూ కార్ల్ మార్క్స్‌కో లేఖ రాసింది. అందులో ఆమె తన భర్త రాడికల్ అయిడియాలజీని కూడా వ్యతిరేకిస్తూ స్త్రీలను సమర్థించింది. ఈ రాడికల్ బృందాల్లో ఎప్పుడూ హక్కుల గురించిన చర్చలు కొనసాగుతుంటాయి. కాని అవన్నీ కేవలం పురుషుల హక్కుల గురించి మాత్రమే 'స్త్రీల హక్కుల గురించి తర్వాత మాట్లాడదాంలే' అంటారు. అదే కోపంతో జెన్నీ, ఫ్రాన్సు నుండి తమ బహిష్కరణనూ, బ్రసెల్స్‌లో గాలిలో దీపంలాగా వున్న బతుకుల్నీ ప్రస్తావించింది. భర్తలాగే తనకూ జర్మనీ అంటే అసహ్యమే. కాని ఆ క్షణాన స్వదేశాన్ని సమర్థించింది :

"ఎందుకోగాని జర్మనీలోనే బాగుందనిపిస్తున్నది. నీవంటి జర్మన్ వ్యతిరేకితో ఇలా మాట్లాడటం సాహసమే. ఇక్కడి వాళ్లందరూ దుర్మార్గులైతే కావచ్చు. కాని నాకు నీచాతి నీచమైన వ్యక్తులతో పరిచయమైంది మాత్రం అభ్యుదయ దేశాలైన ఫ్రాన్స్, బెల్జియంలలోనే. ఇక్కడ కూడా మనుషులు నీచంగానే వుంటారు. కాని వాళ్ల ముందు వీళ్ల నీచత్వం ఎంత! అక్కడ కూడా హీరోలకు ఎవరూ నీరాజనాలు పట్టడం లేదు. అక్కడ వ్యక్తులు ఇక్కడి కన్నా మెరుగ్గా జీవిస్తున్నారా అంటే అదీ లేదు. బహుశా, పురుషులకు ఈ మాట వర్తించకపోవచ్చు. కాని స్త్రీలకు (వీళ్ల పని పిల్లల్ని కనటం, వంట చెయ్యటం, ఇంటి చాకిరీ మాత్రమే గద) మాత్రం జర్మనీలోనే ఉండమని సలహా ఇస్తాను."

" నిజానికి పుస్తక రచనకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం తన భర్తను నిరుత్సాహ పరుస్తుందని తరువాత తెలుసుకుంటుంది జెన్నీ. ఈ కాంట్రాక్ట్ వ్యవహారం అతణ్ణెంత బాధించిందో ఆమె స్వయంగా చూసింది. అనుభవించింది. (కాంట్రాక్ట్) తేదీ సమీపిస్తున్నదంటే చాలు మార్క్స్ శరీరంలో బొబ్బలు లేస్తాయి. కూర్చోలేక, నిల్చోలేక బాధతో విలవిల్లాడిపోతాడు. కాని 1845లో రచన ఇక పూర్తవుతుంది. కాస్త ఆదాయం వస్తుందని ఆశగా ఎదురు చూసిందామె. "

అయితే ఇలా రాసినంత మాత్రాన ఆమెకు జర్మనీలోనే ఉండాలని కోరిక ఉన్నదని కాదు. తను బ్రసెల్స్‌కు వెళుతుంది. అందులో సందేహం లేదు. నిజానికి కొన్నేళ్ల తర్వాత మార్క్స్ దంపతులకు బెర్లిన్‌కు తిరిగి వచ్చే అవకాశం కలిగినప్పుడు ఆమె తీవ్రంగా ఆ ప్రతిపాదనను వ్యతిరేకించింది. నిజానికి ఆ లేఖలో ప్రస్ఫుటమైంది ఆమె సందిగ్ధత. కూతురిగా, భార్యగా సంఘర్షణ. ఎటూ తేల్చుకోలేని నిస్సహాయత. కాని ఇంక ఎక్కువ సమయం లేదు. ఈ లేఖ రాసే నాటికి ఆమెకు ఎనిమిది నెలలు నిండాయి. ప్రసవం బ్రసెల్స్‌లో జరగాలనుకొంటే వెంటనే బయల్దేరక తప్పదు.

జర్మనీలో వున్న మార్క్స్ 'సోషలిస్టులు మిత్రులు' ఆమె ప్రయాణం సజావుగా సాగటానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. వీలైనంత ఎక్కువ విశ్రాంతి కోరుకుంది జెన్నీ. కుదుపులతో ఎక్కువ సేపు ప్రయాణం చేస్తే అనుకోనిదేదైనా జరగొచ్చు. మొత్తంమీద సెప్టెంబర్ 26 నాడు మరో ఆడపిల్లకు జన్మనిచ్చింది జెన్నీ. బిడ్డ పేరు 'లారా'.

ప్రసవానికి ముందర ఈ హడావిడి కార్ల్ పనికి అడ్డు తగులుతుందేమోనని భయపడింది జెన్నీ. భర్తను మధ్య అంతస్తులో పని చేసుకొమ్మని, మొదట చంటిపిల్లతో పైఅంతస్తులోనూ ఆ తర్వాత కింది అంతస్తుకూ వచ్చింది (కార్ల్ రాస్తున్న పుస్తకం పేరు అప్పటికి సింపుల్‌గా 'పొలిటికల్ ఎకానమీ'). అప్పటికే ఆ పుస్తకం గురించి చర్చ జరుగుతున్నది. రాజకీయంగా ఇది ఎంతో ప్రభావం చూపే అవకాశముంది. అంతకన్నా ముఖ్యంగా తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడొచ్చు. పుస్తకాలు తప్ప వాళ్లకు వేరే ఆదాయం లేదు. మిత్రులు వీలైనంత సాయం చెయ్యటం లేదని కాదు. కాని ఎన్నాళ్లిలా పరుల దాతృత్వం మీద ఆధారపడి బతకటం?

'మీ రచన ఎలా కొనసాగుతున్నది?' అన్న ప్రశ్నకు మార్క్స్ ఎప్పుడూ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఎన్నిసార్లడిగినా, 'ఒకటి రెండు వారాల్లో ముగిస్తాను' అనేవాడు. లేదా 'రాసేశాను కాని మెరుగులు దిద్దుతున్నాను' అనీ దాటవేసే వాడు. లేదా ఆర్థిక సమస్యో, మరో సమస్యో వచ్చి పని ముందుకు జరగటం లేదని తప్పించుకునే వాడు. ఎప్పుడూ కొత్త అయిడియాలతో, రాసింది తృప్తిగా లేదనిపించేది. ఒక అయిడియా స్థిరంగా లేనప్పుడు ఎలా రాయటం? కాని నిజంగా అలాగే ఏదో ఒకటి తట్టింది గదా అని రాసుంటే, అంత అత్యద్భుతమైన గ్రంథం మనకు దొరికుండేదా? ఇక ప్రస్తుత విషయానికొస్తే, తను అసలు రచన ప్రారంభించనేలేదనీ, అది కేవలం తన వూహల్లో మాత్రమే ఉందనీ జెన్నీకి చెప్పి వుండడు. నిజానికి పుస్తక రచనకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం తన



భర్తను నిరుత్సాహ పరుస్తుందని తరువాత తెలుసుకుంటుంది జెన్నీ. ఈ కాంట్రాక్ట్ వ్యవహారం అతణ్ణెంత బాధించిందో ఆమె స్వయంగా చూసింది. అనుభవించింది. (కాంట్రాక్ట్) తేదీ సమీపిస్తున్నదంటే చాలు మార్క్స్ శరీరంలో బొబ్బలు లేస్తాయి. కూర్చోలేక, నిల్చోలేక బాధతో విలవిల్లాడిపోతాడు. కాని 1845లో రచన ఇక పూర్తవుతుంది. కాస్త ఆదాయం వస్తుందని ఆశగా ఎదురు చూసిందామె.

నిజానికప్పుడు మార్క్స్ రాయటం లేదని కాదు. రోజూ రాస్తూనే వున్నాడు. లారా పుట్టినప్పుడు, చంటిపాప ఏడ్పులతో ఇల్లు ప్రతిధ్వనించగా, మార్క్స్, ఎంగెల్స్, 'జర్మన్ అయిడియాలజీ' అనే పుస్తకం రాశారు.

జర్మన్ అయిడియాలజీ (తత్వశాస్త్రం) గురించి, తన Theses of Feurbach లోనే ప్రస్తావించాడు మార్క్స్. ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత మిత్రులిద్దరూ ఈ జర్మన్ అయిడియాలజీని, దానితో పాటు అప్పటికి ప్రచారంలో వున్న జర్మన్ సోషలిజాన్ని చెత్త బుట్టలో విసిరేయాలనుకున్నారు. గతంలో జరిగిన పొరబాట్లన్నింటినీ సరిదిద్దకుండా ముఖ్యంగా యంగ్ హెగెలియన్ల గురించి స్పష్టత ఇవ్వకుండా పొలిటికల్ ఎకానమీ పుస్తకం రాయటం సాధ్యం కాదని అప్పటికే తన ప్రచురకర్త కార్ల్ లెస్కెకు స్పష్టం చేశాడు మార్క్స్. కాని ఇంకా చెప్పవలసింది వుంది. ఈసారి ఇద్దరూ కలిసి ఆ ప్రయత్నానికి పూనుకున్నారు.

సశేషం

ఫోన్: 91776 18708

మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, పళ్లు ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. అవి మన శరీరానికి అవసరమైన కీలక పోషకాలను అందిస్తాయి. దాంతో పోషణ శాస్త్రజ్ఞులు కాయగూరలను, పళ్లను విరివిగా తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. గుండె జబ్బు, క్యాన్సర్లు మొదలైన దీర్ఘకాలిక రోగాలను నివారించడంలో అవి రక్షక పాత్రను పోషిస్తాయిని ప్రపంచ వ్యాప్తంగా చేసిన పరిశోధనలు ఇటీవల నిర్ధారించాయి. పలురకాలుగా ఉపయోగించే అవకాశం వున్నందున కూరగాయల్లో టమాటాలు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

అసలు ప్రపంచంలోనే ఒక అతి ముఖ్యమైన ఆహార పంటగా గుర్తింపు పొందిన టమాటాల వుత్పత్తి ఆరుకోట్ల టన్నుల పైచిలుకు వున్నట్లు అంచనా. ఇంతకీ, టమాటా పండా? లేదా కాయగూరా? నిజానికి పండేకానీ తరచూ కాయగూరగా వాడుతున్నాం.

మంచి కండతోపాటు రసభరితమైన ఈ పండులో 5–7 శాతం పొడి పదార్థం వుంటుంది. మన దేశంలో కూరగాయగా మంచి ఆదరణ పొందిన టమేటా దాదాపు సంవత్సరం పొడుగునా లభిస్తుంది. దాన్ని పలు విధాలుగా వుపయోగిస్తారు. బాగా పక్వానికి వచ్చినప్పుడు దాన్ని పచ్చిగా గానీ, సూపులు, సాస్, ఊరగాయలు, కెచప్‌లో మొదలైన వాటిలో వాడతారు.

పుట్టు పూర్వోత్తరాలు : మెక్సికోకు చెందిన రెడ్ ఇండియన్లు ఈ కూరగాయకు 'టమాటా' అన్న పేరు పెట్టారు. అది పదహారవ శతాబ్దిలో అమెరికా ఉష్ణప్రాంతాల నుండి మన దేశం చేరింది. అలా నాలుగు శతాబ్దాల క్రితమే వచ్చినప్పటికీ, ఒక కూరగాయగా టమాటా గత శతాబ్దంలో మాత్రమే తన ప్రాచుర్యాన్ని పెంచుకుంది.

సాగుబడి : టమాటా పంటకు వెచ్చని వాతావరణం అవసరం. లోతైన వేళ్లుండే ఈ మొక్క నిలువుగా పెరుగుతుంది. మంచును మొక్క తట్టుకోలేదు. మన ఉత్తర ప్రాంతంలో రెండు నాట్లు వేసి మొదట జూన్ – జులైలోనూ, రెండవ పంట నవంబరులోనూ తీస్తారు. దేశపు పశ్చిమ, దక్షిణ ప్రాంతాలలో ఈ పంటను ఏడాది పొడుగునా సాగు చేస్తారు.

ఎర్రగా ఎందుకుంటాయి? : ఎర్ర రంగు టమాటాలు ఎక్కువ ప్రాచుర్యంలో వున్నప్పటికీ, గులాబీ, నారింజ, పసుపు పచ్చ, తెలుపు రంగుతో వున్న రకాలు కూడా మరీ అంత అసాధారణమైనవి కావు. దాని విలక్షణమైన ఎరుపు రంగు అందులోని లైకోపిన్ అనబడే ప్రధాన వర్ణం వల్ల ఏర్పడుతుంది. కెరొటినాయిడ్ సంబంధ వర్ణమైన లైకోపిన్, మన శరీరంలో విటమిన్ –ఎ గా మారుతుంది. పండు లోపలి కండభాగంలో కంటే, పండుపై తొక్క పొరల్లో ఈ లైకోపిన్ ఎక్కువగా వుంటుంది.

పళ్లపై సూర్యకాంతి నేరుగా ప్రసరిస్తే, పైభాగాలు లేత పసుపురంగులోకి మారి, తోలులాగ సాగుతాయి. ఎండాకాలంలో ఇలాంటి మార్పులు ప్రత్యేకించి కనబడతాయి. దాన్ని "సన్ స్కాల్డింగ్" అంటారు.

నాణ్యత : టమాటా వ్యాపారం విషయంలో చాలా దేశాలు కొన్ని నాణ్యతా సంబంధ చర్యలు అనుసరి స్తారు. పళ్ల నాణ్యతను నిర్ణయించ డంలో, సైజు, రంగు బాగుండడమే కాకుండా పండు దెబ్బ తినడం, కుళ్లి పోవడం, చీడ పీడలు మొదలైనవి లేకపోవడం వంటి లక్షణా లను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

పండు బాగున్నదంటే దాని వాసన, రుచి కూడా ఆమోదయోగ్యంగా వుండాలి. టమాటాలోని చెక్కెరలు, అందులోని ఆమ్ల గుణాల మధ్య పరస్పర చర్యను బట్టి పండుకు ఆ విలక్షణమైన రుచి అబ్బుతుంది.

టమాటాలో రుచి, వాసనలకు దోహదపడే, తొందరగా ఆవిరి అయ్యే రసాయనాల గురించి శాస్త్రజ్ఞులు చాలా ఆసక్తిని చూపించారు. ఆకు పచ్చ రంగు పళ్లలో అలాంటి రసాయనాలు అతి తక్కువ స్థాయిలో వుంటాయి. కానీ, పక్వానికి వచ్చిన పళ్లలో 200 కంటే ఎక్కువ రసాయనాలు వున్నట్లు గుర్తించారు. వీటిలో చాలా రసాయనాలు వాసనను కలిగించడం లో దోహదపడినప్పటికీ, పండు తినడానికి పసందుగా, రుచి, వాసనలను వుండడానికి బహుశా 15 రసాయనాలు ప్రభావితం చేస్తాయి.

ప్రాసెసింగ్ చేయడంతో టొమేటోల రుచి, వాసనలు మారతాయి. ప్రాసెస్ చేసే చర్యల్లో పండులోని ఎంజైముల స్వభావాన్ని మార్చడం, సుమారు 100 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో వేడి ఏసి సూక్ష్మ జీవకణాలు లేకుండా చేయడం, ముఖ్యమైనవి. రుచికి సంబంధించిన ప్రధాన రసాయనాలు అలాగే వున్నప్పటికి, తాజా పండులోని వాసనకు సంబంధించిన రసాయనాలు నశిస్తాయి. ప్రాసెస్ చేస్తున్నప్పుడు ఎంజైములతో నిమిత్తం లేకుండా అదనంగా రుచి, వాసనలిచ్చే రసాయనాలను చేరుస్తారు. ప్రాసెస్ చేసిన టొమేటోలను ఎక్కువ పాళ్లలో చేర్చి 'పేస్ట్' రూపంలో కనీసం 24శాతం ఘన పదార్థాలు వుండేలా చూస్తారు. సాస్, కెచప్, సూప్‌ల వంటి ఉత్పత్తులలో వుపయోగించడానికి ఎక్కువకాలం పాటు పేస్ట్‌ను నిల్వ వుంచవచ్చు.

ఆరోగ్యపరమైన లాభాలు : భారతీయ వంటల్లో ఒక అంతర్భాగమైపోయిన టమాటా సంవత్సరం పొడుగునా అందరి ఇళ్లల్లో వాడబడు తోంది. ఎక్కువ పరిణామంలో వాడుతున్న కారణంగా టమాటాలు చాలా సూక్ష్మ పోషక పదార్థాలను సరఫరా చేస్తాయి. అందులో పొటాషియం చెప్పుకోదగినంత మేర (ప్రతి 100గ్రాముల్లో 144మి.గ్రా) వున్నందు వల్ల అధిక రక్తపు పోటు వున్న వారికి మేలైన ఆహారంగా భావించవచ్చు. టమాటాలను మామూలుగా పచ్చివిగా తింటారు కనుక పొటాషియం ఎక్కువగానే శరీరానికి అందుతుంది.

కానీ సలాడ్‌గా టమాటాలను వుపయోగిస్తు న్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పళ్లను శుభ్రంగా, ప్రవహిస్తున్న నీటిలో కడిగి పైభాగం నుండి మురికి, అనవసరమైన పదార్థాలు లేకుండా చూసుకోవాలి. ఈ పాటి సరళమైన జాగ్రత్తను తీసుకోవడం ఆహారం ద్వారా వ్యాప్తి చెందే రుగ్మతలు రాకుండా నివారించవచ్చు. ◆

ఫన్నీ...గా...

ఎవర్రా...నిదానమే ప్రధానమని చెప్పింది. నన్ను చూశాకైనా దాన్ని తిరగరాయండి.

కోళ్లు...రంగు గుడ్లు కూడా పెడ్తాయోచ్!

హాయ్! బుజ్జాయిలూ... ఈ వారం మీకోసం బోలెడన్ని తమాషా విషయాలు తీసుకొచ్చాం. చదివేయండి మరి.



- కంగారూలు నడవవు. గెంతుతాయి.
- కొన్ని రకాల కోళ్లు రంగురంగుల గుడ్లు పెడతాయి.
- జిరాఫీ తన నాలుకతో చెవులు శుభ్రం చేసుకుంటుంది. నాలుక పొడవు 21 అంగుళాలు వుంటుంది మరి.
- ధృవపు ఎలుగుబంట్లుకు ఎడమచేతివాటం వుంటుంది.
- ఆవులు రోజుకి 3 గంటలు మాత్రమే నిద్రపోతాయి.
- చిలుకకు 5 సంవత్సరాల పిల్లవాడికి సమానమైన తెలివితేటలు వుంటాయి.
- పిల్లికి ఒక్కో చెవిలో 32 కండరాలుంటాయి.
- అడవి ఎలుక ఒక్క రాత్రిలో 300 అడుగుల పొడవాటి సొరంగాన్ని తవ్వగలదు.
- నిప్పుకోడి మెదడు కంటే దాని కన్ను పెద్దగా వుంటుంది.



- కుక్క 14000 సంవత్సరాలుగా మనిషికి నమ్మిన బంటుగా వుంటోంది.
- కొన్ని రకాల నత్తలు 15 సంవత్సరాలు జీవిస్తాయి.
- కప్పలు తమ ఆహారాన్ని... కనురెప్పలు మూయకుండా మింగలేవు.
- జెల్లీ ఫిష్‌లో 95 శాతం నీళ్లే వుంటాయి.

ఇద్దరు మిత్రులు

కథ



హేమంత్, సుమంత్ మంచి స్నేహితులు. సెలవులకు ఓసారి అడవి అంతా తిరిగి చూడాలని బయలుదేరారు. మధ్యలో తినడానికి చిరుతిళ్లు కూడా సర్దుకున్నారు. అలా అలా అంతా తిరుగుతూ చూస్తుండగానే సాయంత్రం అయిపోయింది. చల్లగా వుండేసరికి ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. ఇంతలో ఎలుగుబంటి అరుపు వినిపించింది. ఇద్దరూ భయపడిపోయారు. ఎటువైపునుంచి ఆ అరుపు వస్తుందో తెల్సుకుందామని చెవులు రిక్కించి వినసాగారు. ఎలుగు కాళ్ల కింద పుల్లలు విరుగుతున్న శబ్దాలు విని అది వస్తున్న దిక్కుని గుర్తించారు. ఇద్దరిలో హేమంత్ కొద్దిగా ముందున్నాడు. వాడు వెంటనే ఆ పక్కనే వున్న చెట్టు కొమ్మ పట్టుకొని పైకి పాకేశాడు. ఎంతసేపటికి తనను తను కాపాడుకోవడం ఎలాగన్నదే ఆలోచించాడుకానీ స్నేహితుడి గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు. వెనక వున్న సుమంత్‌కు చెట్టు ఎక్కే సమయం లేకపోయింది. అతని వెనకే ఎలుగుబంటి వచ్చేస్తోంది. ఏం చేయాలో పాలుపోలేదు. తనను తాను కాపాడుకోవాల్సిన పరిస్థితి. వెంటనే నేల మీద పడుకుండిపోయాడు. ఊపిరి బిగబట్టి అలా కళ్లు మూసుకుని వున్నాడు. అతని దగ్గరకొచ్చిన ఎలుగు వాసన చూడడం మొదలెట్టింది. అతని చెవి దగ్గర ముక్కు వుంచి మరీ వాసన చూసింది. దాంతో భయపడిపోయిన సుమంత్ ఒళ్లంతా చల్లబడిపోయింది. కదలక మెదలక పడివున్న సుమంత్ చనిపోయాడనుకొని ఎలుగు తన దారిన తను వెళ్లిపోయింది. ఎలుగులు చచ్చిన మాంసం ముట్టవు. అదే సుమంత్ ప్రాణం కాపాడింది. తర్వాత చెట్టుపైనున్న హేమంత్ మెల్లిగా చెట్టు దిగి వచ్చి పెద్దగా నవ్వుతూ...

"ఊ...ఎలుగుబంటి నీ చెవిలో ఏం చెప్పిందిరా?" అనడిగాడు ఎగతాళిగా.

దానికి సుమంత్"ఆపద సమయంలో తన దారి తనుచూసుకునే మిత్రుడికి దూరంగా వుండు" అని చెప్పిందంటూ... ఇంటి దారి పట్టాడు. ◆

దారి మరిచానే ...

ఓయ్ చిన్నారులూ...ఇదిగో ఇది మహా టక్కరి పప్పీ. నోరు తెరిస్తే...బడాయిలు, అబద్దాలు చెప్పేస్తుంది. తన ఇంటికి దారి మర్చిపోయిందట. మనం చెప్పాలట. మరి ఈ గజిబిజి దారుల్లో ఇంటికి దారి కనిపెట్టి చెప్పండి.

రంగులు నింపేద్దాం



నేస్తాలూ...ఇక్కడ నిలకడ అంటే ఏంటో తెలీని జంతువు ఒకటి వుంది. ఇలా రంగులు లేకుండా సాదాసీదాగా వుంటే ఏం బావుంటుంది చెప్పండి.
చకచకా రంగులద్దండి.

ఎక్కడున్నాయబ్బా...



Bermuda	Stunt	Silk	Delta
Dragon	Box	Wind	Spars
String	Fighters	Chinese	Diamond
Bowed	Tail	Sled	Spools
Foil	Candle	Winged	Paper

చిన్నారులూ...మీకు గాలిపటాలు ఎగరేయడమంటే బోలెడంత సరదా కదా. మరైతే ఇక్కడ గాలిపటం బొమ్మలో చాలా చాలా అక్షరాలున్నాయి. అందులో కొన్ని పదాలు దాక్కున్నాయి. అవి ఎట్లైనా వుండొచ్చు. అడ్డంగా, నిలువుగా, వంకరగా...ఎలాగైనా. మీరు కనిపెట్టాల్సిన పదాలు కూడా బొమ్మలోనే వున్నాయి. గుర్తుపెట్టి సున్నా చుట్టండే.

అసలు కుక్క ఏది...



ఇక్కడ రెండు కుక్క తలలున్నాయా! వీటిలో అసలు కుక్క ఏది?
అంటే దాని పళ్లు చూసి చెప్పండి.

చుక్కలు కలిపేద్దాం



బుజ్జాయిలూ... ఇక్కడ చుక్కల్లో చిక్కుకున్నారెవరో. వారెవరో తెలియాలంటే...
మీరు 1 నుంచి వరుసగా 38 వరకు చుక్కలు కలిపెయ్యండి.

మాయామర్మం లేని కథలు

మాయామర్మం లేని మనుషులకు చెందిన కథలివి. ఈ కథలు మనల్ని ఊహా లోకంలో విహరింపచేయవు. మనకళ్ళెదుగా కదలాడే జీవితాల వ్యధలివి. మనమంతా మార్కెట్ మాయాజాలంలో జీవిస్తున్నాం. ఇంకా ఆధునికతని సంతరించుకోని పాత సమాజపు గ్రామీణ జీవితానికి చెందిన మార్కెట్ కథలు ఇవన్నీ. సముద్ర తీర మత్స్యకారులు, ఆధునిక వ్యవసాయదారుల మధ్య ఇసుక ప్రాంతాలలో జీవించే ప్రజలకు చెందిన వ్యధార్థగాధలివి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకమైన సంస్కృతి, సాంప్రదాయాలున్నట్లే సముద్ర తీర ఇసుక ప్రాంత ప్రజలూ కొన్ని ప్రత్యేకతలు కలిగి ఉన్నారు. వారికి విభిన్న జీవన విధానం ఉంది. మార్కెట్ ఆధారంగా వారి జీవితాల్లోని అనేక కోణాలను ఈ సంపుటిలోని 17 కథలలో రచయిత రవీంద్రబాబు చిత్రీకరించారు. ఒకే మార్కెట్ దాని పరిసర ప్రాంతాలలో జరిగిన విషయాలను వీటిలో వ్యక్తీకరించారు. ప్రకాశం జిల్లా సముద్ర ప్రాంతంలో ఉన్న 'మన్నూరు' వీటి పుట్టినూరు. రచయిత పుట్టినూరు కూడా కనుక ఆయన జ్ఞాపకాల నుంచి పుట్టిన కథలివి.



మార్కెట్ కథలు,
రచయిత : ఎ.రవీంద్రబాబు,
వెల: రూ 50, పేజీలు: 90,
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్- 500001,
ఫోన్: 24744580.

రచయిత ఉపయోగించిన భాష ప్రత్యేకమైనది. ఇప్పటి వరకు పాత్రలు మాట్లాడే భాష ఆయా మాండలికాల్లో రాయటం మనం చూశాం. అయితే రవీంద్రబాబు మొత్తం కథనంతా మాండలికంలోనే రాశారు. పాఠకులకు ఎంతవరకూ ఇది అందుతుందనేది చెప్పలేం. అంతే కాకుండా జీవితాన్ని ఉన్నదున్నట్లు చిత్రీకరిస్తే చాలదు. జీవితసారాన్ని గ్రహించి ప్రజలను, సమాజాన్ని ముందుకు నడపే మార్గం చూపాలి. ఆ రీత్యా చూసినప్పుడు ఈ కథల ప్రయోజనం తక్కువ.

- భవిష్య

'అనుపమ' ఓ జ్ఞాపకాల చెట్టు

'అనంతారం-మాధవ్-ఒక అనుపమ ధార" అంటూ ప్రముఖ కవి, దేవి ప్రియ ఎంతో చక్కని విలువైన ముందుమాట రాశారు. 46 కవితలున్న ఈ కవితా సంపుటిలో మానవ జీవనయానంలోని అనేక పార్శ్వాలు తడిమి.... పాఠకుల్ని ఆలోచింపచేస్తాయి. గడచిన పాతిక ముప్పయి సంవత్సరాలలో వచ్చిన మార్పులు, జరిగిన సామాజిక విచ్ఛిన్నతను అక్షరీకరించారు.

చెమట చిత్తడి నేల (1998), స్పర్శ (2005) సంకలనాలు వెలువరించిన మాధవరావు కవిత్వంలో 'మానవతా వాదం' ధ్వనిస్తుంది. దేవిప్రియ అన్నట్లుగా ఈ 'అనుపమ'లో అవలీలగా 'స్థానికతను విశ్వజనీనతగా' మార్చివేశాడు.

వీరి కవితల్లో కొన్నింటిని చూద్దాం.. "నిజానికి ఇప్పుడు మనిషి కంటే / అద్భుతమైనదేదీ కనిపించదు అద్భుతాన్ని సృష్టించే వాడు కదా మనిషి (పేజి.16). పునరపి జననం కవితలో (పేజి.26) కవి మట్టి కోసం పరితపించే తీరు ప్రశంసనీయం. "నేను ఎన్ని సార్లు మరణించినా / తిరిగి తిరిగి మొలుస్తూనే ఉంటాను. శ్మశాన వైరాగ్యాన్ని ఆలపించను / మట్టి కోసం నిరంతరం పరిగెడుతూనే ఉంటాను అంటారు.

"విడి విడిగానే" అనే కవితలో ఒక చోట మాధవరావు ఇలా అంటారు. ప్రశ్నించడాన్ని / ఎదిరించడాన్ని / ముందే నేర్చుకొన్నందుకు / పిడికెడు మెతుకుల కోసం వలస / జాతి తరతరాల చరిత్రంతా / పోరాటాలూ అన్వేషణలూ (పేజి.111) అన్న కవితలు పాఠకులచే ఏకబిగువున చివరి పేజి దాకా చదివింపజేస్తాయి. పల్లెను, మట్టి గొంతును, సామాన్యులను.... కవిత్వీకరించే వీరి కలం మరింత శక్తివంతమైన కవిత్వం రావాలని ఆశిద్దాం.

అనుపమ (కవితా సంపుటి),
కవి : బండ్ల మాధవరావు, పేజీలు : 112,
వెల : రూ.100/-, ప్రతులకు : సాహితీ మిత్రులు, హెచ్.నెం.28-10-16, మశమ వీధి, అరండల్‌పేట, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002, సెల్ : 09490634849, మరియు నవోదయ బుక్‌హౌస్.

- తంగిరాల చక్రవర్తి

స్వీకారం

వేగావతి కథలు
సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి
పేజీలు : 288, వెల : రూ.150/-,
ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, మసీద్ స్ట్రీట్, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ. దిశ బుక్ సెంటర్, త్రినేత్ర సూపర్ మార్కెట్ ఎదురుగా, చిక్కడపల్లి, హైదరాబాద్; మని బుక్ స్టాల్, సండే మార్కెట్, నెల్లూరు, శ్రీకాకుళసాహితి, హరిత, 11-2, విశాఖ 'ఎ' కాలనీ, శ్రీకాకుళం-532001.

పునరాగమనం
రచయిత : ఎ.వి.రెడ్డి శాస్త్రి
పేజీలు : 184, వెల : రూ.100/-, ప్రతులకు : శ్రీకాకుళసాహితి, హరిత, 11-2, విశాఖ 'ఎ' కాలనీ, శ్రీకాకుళం-532001



మా కథలు 2013
సంకలన కర్త : సి.హెచ్.శివరామ ప్రసాద్
పేజీలు : 342, వెల : రూ.99/-,
ప్రతులకు : సిహెచ్.శివరామ ప్రసాద్, కన్వీనర్ తెలుగు కథ, రచయితల వేదిక, స్వగృహ అపార్ట్‌మెంట్, 'సి' బ్లాక్, ప్లాట్ నెం.3, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072,

మంకెన్నలకు మహా విందు

విందులూ వినోదాలూ మనకేనా? మంకెన్నలకూ వుంటాయి. కాకపోతే ఏడాదికి ఒక్కరోజు ... ఒక్క చోట మాత్రమే. థాయ్‌లాండ్‌లో లోప్‌బురి అనే నగరం వుంది. అక్కడ గత పాతికేళ్లగా కోతులకు విందు ఇస్తున్నారు. నిజానికి దీనికి 'కోతుల నగరం' అన్న పేరు కూడా వుందిలెండి. నవంబర్ చివరి ఆదివారం నాడు వుంటుందీ భారీ విందు. గత నెల 30వ తేదీన 2500 కిలోల పళ్లు, కూరగాయలతో కోతులకు చక్కటి బఫే ఏర్పాటు చేశారు. ఇక చూస్కోండి! రెచ్చిపోయి మరీ తమకిష్టమైన పళ్లు తిని, కూల్‌డ్రింకులు తాగేసి తేన్చాయి థాయ్ కోతులు. ఇంతకీ ఇదంతా ఎందుకంటే... అక్కడ పర్యాటక రంగాన్ని వృద్ధి చేసుకోడానికట. ఐడియా అదిరిందా! ❑

బొమ్మల బ్రహ్మ



బ్రూనో

జీవం పుట్టిపడుతున్న ఈ బొమ్మల సృష్టికర్తకు సలాం చేయాల్సిందే ఎవరైనా. అంతగా కట్టిపడేస్తాయి చూపరులను. ఆ ఘనత బ్రూనో టార్ఫ్ అనే దక్షిణ అమెరికా దేశస్తుడిదే. మొదట్లో ఏవో చిన్న చిన్న వ్యాపార ప్రకటనలు రాసుకుంటుండేవాడు బ్రూనో. తర్వాత తైలవర్ణ చిత్రాలు, శిల్పాలు చెక్కడం మొదలెట్టాడు. కుటుంబం అంతా యూరపు చేరుకోవడంతో... అక్కడే అతని ప్రతిభ గురించి ప్రపంచానికి తెలిసింది. అయితే ప్రారంభంలో తన బొమ్మలను ఎగ్జిబిషన్లో పెట్టి అమ్మేవాడు. అలా కాకుండా టెర్రకోట బొమ్మలతో ఒక తోటనే ఏర్పాటు చేస్తే ఎలా వుంటుంది? అన్న ఆలోచన వచ్చింది. మెల్‌బోర్న్‌లోని ఒక చిన్న గ్రామం అందుకు వేదికైంది. మొదట పదిహేను టెర్రకోట బొమ్మలతో ప్రదర్శన ఏర్పాటు చేశాడు. అనంతరం కొన్ని సంవత్సరాల పాటు కష్టించి పదిహేను వందల నిలువెత్తు బొమ్మలతో సందర్శకులను ఆకట్టుకున్నాడు. అయితే ఓ అగ్ని ప్రమాదంలో బ్రూనో కష్టం అంతా బూడిదైపోయింది. బంధుమిత్రులు, కళాభిమానుల నుంచి వచ్చిన మద్దతుతో తిరిగి తన కలల వనాన్ని ఏర్పాటు చేయగలిగాడు. ప్రపంచ నలుమూలల నుంచి వస్తున్న సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న ఆ సజీవ శిల్పాలే మీ ముందున్నవి. ❑